teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 283 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 22 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## రంజాన్ నేపథ్యంలో రాష్ట్ర సర్కార్ మరో నిర్ణయం

### మార్చి 2 నుంచి 31 వరకు షాపుల పనివేళలు 24 గంటలు

### ఈ మేరకు అనుమతులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రంజాన్ నేపథ్యంలో ఇది వరకే ముస్లింలకు సమయపాలనలో వెసులుబాటు కల్పించగా ఇపుడు మరో ముఖ్య నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 2 నుంచి 31 వరకు షాపులను 24 గంటలు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. మేరకు రాష్ట్ర కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా సిబ్బంది ఎవరైనా

మిగతా 2 లో



## ఎండకాలం పంటలు వేసి నష్టపోవద్దు

నీళ్లు ఉంటేనే పంటలు వేసుకోండి

రైతులు అప్పులు చేసి బోర్లు వేయొద్దు

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కీలక సూచనలు

02

## సైబర్ నేరాలపై తెలంగాణ పోలీస్ ఆసక్తికర ట్వీట్

సైబర్ నేరాలను మీరే ఎదుర్కోవచ్చు

సైబర్ నేరానికి గురవ్వకుండా కాపాడుకోవడం సులభం

02



## అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుపై

# సర్కార్ కసరత్తు

### జిల్లాల్లో అసైన్డ్ భూములు వివరాలను పరిశీలిస్తున్న ప్రభుత్వం

ఇతర రాష్ట్రాల్లో అసైన్డ్ భూముల కేటాయింపు విధానాలపై స్టడీ

రాష్ట్రంలో 24.25 లక్షల ఎకరాల భూములు ఉన్నట్లు సమాచారం

డిజిటల్ సైన్ కానివి 5.36 లక్షల ఎకరాలు ఉన్నట్లు గుర్తింపు



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు రాష్ట్ర సర్కార్ కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఏయే జిల్లాల్లో ఎంతెంత అసైన్డ్ భూములు ఉన్నాయో వివరాలు తెప్పించుకున్నది. ఇతర రాష్ట్రాల్లో అసైన్డ్ భూములకు ఎలాంటి హక్కులు కల్పించారో కూడా అధ్యయనం చేయనున్నట్లు

మిగతా 2 లో

## సచివాలయ నిర్మాణ అంశాలపై దృష్టి సారించిన ప్రభుత్వం

నిధులు, నాణ్యత, కొనుగోల్లపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు

విచారణ మొదలుపెట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): సచివాలయ నిర్మాణం, వ్యయం అంశాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయానికి వెచ్చించిన నిధులు, నిర్మాణం, నాణ్యత, ఐటీ పరికరాల కొనుగోలు అంశాలను తేల్చాలని విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. సర్కారు ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వింగ్‌ల వారిగా విచారణ

మిగతా 2 లో

## రైల్వే జనరల్ టికెట్ల విషయంలో కొత్త రూల్స్

ఇకపై జనరల్ టికెట్‌పై ట్రైన్ పేరు, వివరాల నమోదు

ఏ ట్రైన్ పడితే అది ఎక్కుతాం అంటే కష్టం

కొత్త రూల్స్ అమలులోకి వస్తే ప్రయాణికులకు కొత్త కష్టాలు..?



02

## మేడిగడ్డ బ్యారేజి కుంగిన ఘటనపై విచారణ వాయిదా

రాజలింగం మృతి చెందాడని హైకోర్టుకు తెలిపిన న్యాయవాదులు

పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ధర్మాసనం

భూపాలపల్లి జిల్లా కోర్టు ఆదేశాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీష్ రావులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. మేడిగడ్డ కుంగుబాటుకు కేసీఆర్, హరీశ్‌రావు, ఇతరుల అవినీతే

మిగతా 2 లో



## మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

తెలంగాణలో కోటి మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే తన లక్ష్యం అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లిలో రేవంత్ రెడ్డి మహిళా సమాఖ్య పెట్రోల్ బంకును ప్రారంభించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): గత ప్రభుత్వం మహిళా సంఘాల్ని పట్టించుకోలేదు. మహిళా సంఘాల్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలని ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నాం. గతంలో మామూలు చీరలు ఇచ్చేవారు. ఇప్పుడు ఖరీదైన చీరలు ఇస్తున్నాం. అంబానీ, అదానీలు

మిగతా 2 లో

## కృష్ణా జలాల అంశంపై సమావేశం వాయిదాకు ఏపి లేఖ

ఈనెల 24కు వాయిదా వేసిన యాజమాన్య బోర్డు




తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తోందని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవలే కృష్ణా నది యాజమాన్య బోర్డుకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే

మిగతా 2 లో

## ఓయూ డిగ్రీ పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఎంసీఏ పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగింపు

కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్





## ఏపీ కేడర్ ఐపీఎస్ లకు కేంద్ర హెూం శాఖ రిలీవ్ ఆర్డర్స్

24 గంటల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): డీజీ అంజనీకుమార్ ను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హెూంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏపీ కేడర్ ఐపీఎస్ గా ఉన్న అంజనీకుమార్‌తో

మిగతా 2 లో

## కెసిఆర్, కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ సవాల్

బీఆర్ఎస్, బీజేపీ సుదీర్ఘ, కాంగ్రెస్ ఏడాది పాలనపై చర్చకు సిద్ధం

చర్చలో తాను ఓడితే ముక్కు నేలకు రాస్తా: సీఎం రేవంత్

కిషన్ రెడ్డి చర్చకు రావాలని రేవంత్ పిలుపు



02

## రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌పై ప్రభుత్వం కసరత్తు

ఈ నేపథ్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహణ

వివిధ శాఖల ప్రీ బడ్జెట్ పై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష



02

# అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుపై సర్కార్ కసరత్తు

మొదటి పేజీ తరువాయి

తెలుస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 24.25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు తేలింది. ఇందులో డిజిటల్ సైన్ కానివి 5.36 లక్షల ఎకరాలు ఉన్నట్లు గుర్తించింది. పోడు రైతులకు, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు క్రయ, విక్రయాలతో సహా అన్ని యాజమాన్య హక్కులు కల్పిస్తామని.. 2022, మే 6న వరంగల్ రైతు డిక్లరేషన్ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా రైతులకు ఎలా హక్కులు కల్పించాలనే దానిపై రాష్ట్ర సర్కార్ కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే చాలా మంది రైతులు.. వారికి ఇచ్చిన అసైన్డ్ భూములను అవసరాలకు అమ్ముకున్నట్లు తెలిసింది. అయితే, ఇవన్నీ నోటరీల మీద జరిగాయి. దళితులు, గిరిజనులు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ పట్టాలకు యాజ మాన్య హక్కులు కల్పిస్తే.. వారి అవసరాలకు అమ్ముకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములు పంపిణీ చేసింది. అసైన్ చేసి 20 ఏండ్లు దాటితే హక్కులు కల్పించాలని యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 2.05 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 1.77 లక్షల ఎకరాలు, కామారెడ్డిలో 1.31 లక్షల ఎకరాలు, మెదక్‌లో 1.49 లక్షల ఎకరాలు, నల్లగొండలో 1.41 లక్షల ఎకరాలు, నిజామాబాద్‌లో 1.31 లక్షల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. అసైన్డ్ భూములపై.. పేదలకు హక్కులు కల్పించడంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో విధానాన్ని అమలు చేసింది. వాటిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ స్టడీ చేస్తున్నది. కాగా రైతు డిక్లరేషన్‌లో చేసిన ప్రకటనకు అనుగుణంగా రైతులకు ఎటువంటి హక్కులు కల్పించాలన్న విషయంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. చాలా మంది రైతులు వారికి ఇచ్చిన అసైన్డ్ భూములను విక్రయించినట్లు తెలిసింది. అవన్నీ నోటరీల మీదే జరగడం గమనార్హం. దళితులతో పాటు



గిరిజనులు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ పట్టాలకు ఒకవేళ యాజమాన్య హక్కులు కల్పిస్తే వారు వాటిని తమ అవసరాల మేరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాంలో దశల వారీగా ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. అసైన్డ్ చట్టం ప్రకారం భూమిని పొందిన యజమాని మినహా ఇతరులు ఎవ్వరికీ దానిపై అధికారం ఉండదు. అలాగే, అమ్మడానికి, దానం చేయడానికి, బహుమతిగా ఇవ్వడానికి వీలు లేదు. అప్పట్లో సర్కారు అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం 1977ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

దానికే ఇప్పుడు సవరణ చేయనున్నట్లు తెలుస్తోంది. అసైన్డ్ భూములను ఎంత కాలం కింద కేటాయిస్తే వాటికి హక్కులు కల్పించాలనే దానిపై గవర్నమెంట్ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## సచివాలయ నిర్మాణ అంశాలపై దృష్టి సారించిన ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

మొదలుపెట్టింది. అయితే, ఈ విచారణలో సచివాలయం నిర్మాణంలో భారీ అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐటీ విభాగంపై విజిలెన్స్ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆ నివేదికలో సెక్రటేరియట్‌లో మొత్తం కంప్యూటర్స్, ఫోన్స్, హార్డ్‌వేర్, టీవీలు, ఎలక్ట్రానిక్స్ సహా కలిపి రూ. 320కోట్లకు పైగా ఖర్చు దాటిందని విజిలెన్స్ పేర్కొంది. కనీస నిబంధనలు పాటించకుండా ఐటీ విభాగానికి చెందిన పరికరాలను కొనుగోలు చేసినట్లు తేల్చింది. బిల్లులు మంజూరు చేయకుండానే నిధులను విడుదల చేసినట్లు గుర్తించింది. రూ. 320 కోట్లకు పైగా నిధుల విడుదలకు ఎలాంటి ఆధారాలు లేవని తేల్చేసింది. ఇప్పటివరకు ప్రభుత్వం సెక్రటేరియట్ వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. దాదాపుగా ఇప్పటివరకు రూ. 500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు ప్రభుత్వం సదరు సంస్థకు నిధులను విడుదల చేసింది. మొత్తం అంచనా రూ. 1500 కోట్ల వరకు ఉంటుందని విజిలెన్స్ తాత్కాలిక రిపోర్టులో పేర్కొంది.

## రైల్వే జనరల్ టికెట్ల విషయంలో కొత్త రూల్స్

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ఇండియన్ రైల్వే ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రైల్వే నెటవర్క్. వేల ట్రైన్లు... ప్రతి రోజు కోట్లమంది ప్రయాణికులను ఇండియన్ రైల్వే గమ్యస్థానాలకు చేరుస్తుంది. థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ, ఫస్ట్ ఏసీ, ఏసీ కార్ చైర్, స్లీపర్, సెకండ్ సిట్టింగ్ కోచ్‌లలో ట్రావెల్ చేసేందుకు వీలు కల్పించింది. వీటిలో ప్రయాణించాలంటే ముందు టికెట్లు బుక్ చేసుకోవాలి. అయితే వీటిలో జనరల్ బోగీలు కూడా ఉంటాయి మనందరికి తెలుసు. జనరల్ టికెట్ తీసుకోవడం ద్వారా ఏ రైల్లో అయినా ప్రయాణించవచ్చు. అయితే ఇండియన్ రైల్వే జనరల్ టికెట్లతో ప్రయాణం విషయంలో కొత్త రూల్స్ తీసుకొస్తుంది. సాధారణంగా జనరల్ టికెట్‌తో ఏ రైలులో అయినా జనరల్ బోగీల్లో ప్రయాణించే వీలుంటుంది. ఇకనుంచి ఈ ఫెసిలిటీ ఉండబోదు. జనరల్ టికెట్ బుకింగ్‌కి సంబంధించిన రూల్స్ ను మార్చింది రైల్వేశాఖ. ఈ నిర్ణయం అమలులోకి వస్తే జనరల్ టికెట్‌పై సంబంధిత ట్రైన్ పేరు, వివరాలు ఎంటర్ చేస్తారు. కొత్త రూల్స్ ప్రకారం జనరల్ టికెట్ తీసుకుంటే నిర్దేశించిన బడిన రైలులోనే ప్రయాణించాలి. ఏ రైలు పడితే ఆ రైలులో ప్రయాణించకూడదు. దీంతో పాటు జనర ల్ టికెట్ చెల్లుబాటు కాలం మూడు గంటలకు పరిమితం చేశారు. ఇటీవల న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన రద్దీ, తొక్కిసలాటల సంఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సంఘటనతో రైల్వేలు కఠినమైన నిబంధనలను అమలు చేశాయి.

## ఎండకాలం పంటలు వేసి నష్టపోవద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): వేసవి వేళ తెలంగాణ రైతులకు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కీలక సూచనలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. రైతులు అప్పులు చేసి బోర్లు వేయొద్దు. నీళ్లు ఉంటేనే పంటలు వేసుకోండి. ఎండకాలం పంటలు వేసి నష్టపోవద్దని సూచనలు చేశారు. ముఖ్యంగా బోర్లు వేసి అప్పుల పాలు కావొద్దని విజ్ఞప్తి చేశారు. రైతులే ఈ దేశానికి వెన్నెముక అని రైతుల ప్రాణం చాలా విలువైనదని అన్నారు. రైతుల మేలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయాల్సింది మొత్తం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం మనం ఫిబ్రవరి నెలలో ఉన్నాం సాధారణంగా మార్చి తరువాతనే ఎండలు ముదురుతాయి. కానీ అలాంటి పరిస్థితికి భిన్నంగా ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతున్నాయి. ఎండల తీవ్రత వలన పంటలు ఎండిపోతున్నాయని దాంతో ఇబ్బందులు పడుతున్నట్టు మా కమిషన్ దృష్టికి వచ్చిందని అన్నారు. అందుకే రైతాంగానికి ఒక విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ పరిస్థితుల్లో అప్పులు చేసి బోర్లు వేయకండి అన్నారు. కమిషన్ ఎప్పుడూ రైతాంగం అభివృద్ధి చెందాలనే చూస్తుందని తెలిపారు. ఉన్న పంటలను కాపాడుకోండి. అదనంగా వరి వేయకండి అని సూచించారు.

## సైబర్ నేరాలపై తెలంగాణ పోలీస్ ఆసక్తికర ట్వీట్

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): సైబర్ నేరాలను మీరే ఎదుర్కోవచ్చు అని తెలంగాణ పోలీస్ ఆసక్తికర ట్వీట్ చేసింది. ఇటీవల కాలంలో సైబర్ నేరాగాళ్లు రెచ్చిపోతున్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని కొత్త కొత్త స్కాములకు పాల్పడి అమాయక ప్రజలను సైబర్ నేరాల భారీన పడేస్తున్నారు. కృత్రిమ మేధ సాహయంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇలాంటి నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కూడా అమాయకులే కాక సాఫ్ట్ వేర్ ఉద్యోగులు సైతం మోసపోతూనే ఉన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు తెలంగాణ పోలీసులు సోషల్ మీడియాలో ఎల్లప్పుడు యాక్టివ్ గా ఉంటూ ప్రత్యేక ట్వీట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం సైబర్ నేరాలపై సలహాలు ఇస్తూ స్పెషల్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ లో సైబర్ నేరాలను మీరే ఎదుర్కోవచ్చని, సైబర్ నేరానికి గురవ్వకుండా కాపాడుకోవడం చాలా సులభం అని చెప్పుకొచ్చారు. అలాగే సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని, మీ సన్నిహితులకు అవగాహన కల్పించాలని, ఈజీ మనీ కోసం ఆశ పడవద్దని, ఎవరైనా బెదిరిస్తే భయపడవద్దని పలు సూచనలు చేసింది. ఇక దీనిపై సైబర్ నేరాలను ఎదుర్కోవడం చాలా సులభమని, సరైన అవగాహన ఉంటే సైబర్ నేరాల బారిన పడే అవకాశం అస్సలు ఉండదని, కాబట్టి మీ సన్నిహితులకు ఎప్పటికప్పుడు సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలని, వారికి కూడా అవగాహన కల్పించండి అని రాసుకొచ్చింది.

## ఎమ్మెల్సీ ఓటు ఉన్న ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

**ఈ మేరకు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం**

**ఈ నెల 27న పోలింగ్ ఉండటంతో ఉద్యోగులకు సెలవు**



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గ్రాడ్యుయేట్, రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించింది. ఈ నెల 27న పోలింగ్ తేదీ ఉండటంతో ఆ రోజు ఎమ్మెల్సీ ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ఇచ్చింది. మరోవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల విషయంలోనూ సీఈవో కీలక సూచనలు చేశారు. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులు ఓటు వేసేలా సహకరించాలని సీఈవో (ప్రధాన ఎన్నికల అధికారి) కోరారు. షిఫ్టుల సర్దుబాటు, ఓటు వేసేందుకు సమయం ఇవ్వాలని సీఈవో కోరారు. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ స్థానానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు, అదేవిధంగా వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి.

## మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై విచారణ వాయిదా




మొదటి పేజీ తరువాయి

కారణమని, దీనిపై కేసు పెట్టాలని భూపాలపల్లికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపిన భూపాలపల్లి జిల్లా కోర్టు విచారణకు కేసీఆర్, హరీష్ రావులు వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఆదేశాలు కొట్టివేయాలని కేసీఆర్, హరీష్ రావులు హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఈ పిటిషన్ ను హైకోర్టు ధర్మాసనం విచారించింది. జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్లు కేసీఆర్, హరీష్ రావుల తరపు న్యాయవాదులు వాదన వినిపించారు. శుక్రవారం విచారణ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కోర్టులో వారిపై ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందాడని న్యాయవాదులు హైకోర్టుకు తెలిపారు.

వాదనల అనంతరం కేసు విచారణను సోమవారానికి వాయిదా వేశారు. ఈ కేసు ఇప్పటికే కేసీఆర్, హరీష్ రావులు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నిర్మాణంలో అవతవకలు జరిగాయంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై భూపల్లిపల్లి కోర్టులో కేసు వేసిన నాగవెల్లి రాజలింగమూర్తి తాజాగా హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ఆయనను నడిరోడ్డుపై కత్తులతో పొడిచి చంపేశారు. దీంతో వ్యవహారం రాజకీయం రంగు పులుముకుంది.

## మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం



మొదటి పేజీ తరువాయి

పోటీపడే సోలార్ ప్రాజెక్టులలో మహిళలను ప్రోత్సహిస్తాం. మహిళలు వ్యాపారంలో వేగంగా ఎదిగేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. దేశంలోనే తొలిసారి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషం. ఈ ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. మహిళలు ఆత్మగౌరవంతో బ్రతుకుతారని మా ప్రభుత్వం ప్రగాఢంగా నమ్ముతోంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించాం. రాష్ట్రంలో మహిళా శక్తి 67 లక్షల మంది తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. అన్ని రంగాల్లో మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 600 ఆర్టీసీ బస్సులకూ యజమానులను చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నాం. మహిళా స్వయం సహాయక ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి శిల్పారామం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి ఇచ్చాం. త్వరలోనే మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏడాదికి రెండు చీరలు కానుకగా ఇవ్వనున్నాం. సొంత ఆడబిడ్డలకు అందించినట్లు నాణ్యమైన చీరలను అందించనున్నాం .రూరల్, అర్బన్ అనే తేడా లేదు. తెలంగాణలో మహిళలంతా ఒక్కటే అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుందాం. ఎంపీ డీకే అరుణ కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరుతున్నా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నాం. పాఠశాల లపై ప్రత్యేక దృష్టి పెట్టండి. నిధులు మేం ఇస్తాం నిర్వహణ మీరు చేయండి. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహించుకుంటామో బడుల ను కూడా అలాగే నిర్వహించుకోవాలి అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## రాబోయే ఆర్థిక సం. బడ్జెట్ పై ప్రభుత్వం కసరత్తు



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తోంది. వివిధ శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖ స్వీకరిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అద్దెలు, డైట్ చార్జిలు పెండింగ్ లో పెట్టవద్దని అధికారులకు సూచించారు. అటవీ భూముల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులు హాస్టల్లో పర్యటన నిరంతరం కొనసాగేలా ప్రయత్నించాలని సూచించారు.

## ఓయూ డిగ్రీ పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాల విడుదల



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంసీఏ పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎంసీఏ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షా ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 21వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ తదితర కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## ఏపీ కేడర్ ఐపీఎస్‌లకు కేంద్ర హోం శాఖ రిలీవ్ ఆర్డర్స్

మొదటి పేజీ తరువాయి

పాటు అభిలాష బిస్త్, అభిషేక్ మహంతికు సైతం రిలీవ్ ఆర్డర్స్ వచ్చాయి. ప్రస్తుతం కరీంనగర్ సీపీగా మహంతి ఉండగా తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బిస్త్ పని చేస్తున్నారు. అయితే ఈ ముగ్గురిని ఏపీ కేడర్‌లో రిపోర్టు చేయాలని ఎమ్‌హెచ్ఏ ఆదేశించింది. కాగా రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఐదుగురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీకి కేటాయించారు. అయితే వాళ్లు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ఇటీవల కాలంలో ఐఏఎస్ అధికారులను ఏపీకి పంపారు. ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి, వాణీ ప్రసాద్, వాకాటి కారుణ, రొనాల్డ్ రాస్, ప్రశాంతి ఏపీలో సేవలు అందిస్తున్నారు. మిగిలిన ముగ్గురు ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి వెళ్లాల్సి ఉంది. తాజాగా వీరిని రిలీవ్ చేస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. కాగా 24 గంటల్లోగా ఆంధ్రాలో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఈ అధికారులను ఏపీకి కేటాయించబడ్డారు. అయితే, ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి తెలంగాణలోనే కొనసాగుతున్నారు ఈ ఐపీఎస్ అధికారులు.

## కెసిఆర్, కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ సవాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన 11 ఏళ్ల మోదీ పాలన ఏడాది కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు తాను చర్చకు సిద్ధమని కేసీఆర్, కిషన్ రెడ్డి చర్చకు రావాలన్నారు. చర్చలో తాను ఓడితే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు రేవంత్. ప్రజాపాలన బాగలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యగాలిచ్చాం 21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని చెప్పారు. పరిశ్రమలు, ప్రాజెక్టులు రాకుండా బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటుందని మండిపడ్డారు రేవంత్. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్, నారాయణపేట్ ,కొడంగల్ ప్రాజెక్టులను మొదలు పెట్టానన్నారు రేవంత్. కేసీఆర్ గట్టిగా కొడతానంటున్నావ్ గట్టిగా కొట్టడానికి అది ఫుల్లా, ఆఫా కొట్టాలనుకుంటే ముందుగా మీ బిడ్డను ,కొడుకును, అల్లుడిని కొట్టు మమ్మల్ని కొడితే మా కార్యకర్తలు ఊరుకుంటారా? ఇచ్చిన హామీలను ఐదేళ్లలో పూర్తి చేసే బాధ్యత నాదే అని రేవంత్ అన్నారు.

## కృష్ణా జలాల అంశంపై సమావేశం వాయిదాకు ఏపి లేఖ

మొదటి పేజీ తరువాయి

కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం బోర్డు సమావేశం కావాల్సి ఉంది. కానీ, అనూహ్యంగా సమావేశాన్ని వాయిదా వేయాలని కోరుతూ ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేఆర్ఎంబీ కి లేఖ రాశారు. అత్యవసర సమావేశం ఉన్నందున భేటీని వాయిదా వేయాలని ఆ లేఖలో ప్రస్తావించారు. అయితే, మధ్యాహ్నం 3.30కి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాటు నీటి పారుదల శాఖ అధికారులు కేఆర్ఎంబీ కార్యాలయానికి వెళ్లి అక్కడ తమ వాదనలు వినిపించనున్నారు. ముఖ్యంగా తాగు, సాగు నీటి అవసరాలను బోర్డుకు వివరించనున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశాన్ని ఈనెల 24కు మధ్యాహ్నం 3.30కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## రంజాన్ నేపథ్యంలో రాష్ట్ర సర్కార్ మరో నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

రోజూకు 8 గంటలకు మించి, వారానికి 48 గంటలు మించి పని చేస్తే యజమానులు రెట్టింపు వేతనాలు ఇవ్వాల్సిందేనని ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా సెలవు దినాల్లో పనిచేస్తే ప్రత్యామ్నాయ లీవ్ ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. కాగా రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మసీదులు, ఈద్గాల వద్ద నీటి వసతి, కరెంటు సౌకర్యం, వాష్ రూమ్స్ సదుపాయాలు కల్పించాలని అధికారులకు తెలియజేసింది. కాగా రంజాన్ నెల పూర్తయ్యే వరకు ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే ఇళ్లకు వెళ్లిపోయేలా వెసులుబాటు కల్పిస్తూ ఇదివరకే ఆదేశాలు జారీ చేసింది సర్కార్.

# పట్టభద్రుల ఎన్నికకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

## జిల్లా అధికారులు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. శుక్రవారం మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం మరియు వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లుపై అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

జిల్లాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు పాటించాల్సిన నియమాలు వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణి 90 శాతం జరిగిందని, శనివారం వరకు మిగిలిన 10 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. భూపాలపల్లి 7, కాటారం డివిజన్లు లో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 76 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి మొదటి విడత శిక్షణ నిర్వహించామని, రెండో విడత శిక్షణ 24వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 35 పోలింగ్ బాక్స్ లు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ రవాణాకు నాలుగు రూట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఓటరు ఫెలిసి టేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రబీ పంటకు నీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రబీ పంటకు అవసరమైన నీటి సరఫరా కోసం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులతో రబీలో సాగునీటి సౌకర్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ పంటకు అవసరమైన నీటి సరఫరా కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంటలకు సమృద్ధిగా సమయానికి సాగు నీరు అందించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి పరిస్థితి, కాలువల ద్వారా నీటి సరఫరా, భూగర్భ జలాల స్థితిగతులు మొదలైన అంశాలను అధికారులు పరిగణలోకి తీసుకుంటూ పంటలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను గుర్తించి తక్షణ ప్రత్యామ్నయ చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎస్ఆర్ఎస్పి నుండి సరఫరా అయ్యే నీటి విడుదల వల్ల రేగొండ, చిట్యాల మండలాల రైతులకు మేలుజరుగుతుందని తెలిపారు. వ్యవసాయ ఇరిగేషన్ శాఖల అధికారు లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వ్యత్యాసం లేకుండా సాగు వాస్తవ నివేదికలు అందించేయాలని పేర్కొన్నారు. జిల్లాలో గత రబీ సీజన్లో 86 వేల ఎకరాలలో పంట సాగు జరిగిందని, ఈ రబీ సీజన్లో 82 వేల ఎకరాలలో సాగయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత సంవత్సరం నీరందక పంటలు ఎండిపోయిన ప్రాంతాలను, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యాన్మయ ఏర్పాట్లుపై రైతులకు అవగాహన కల్పించాలని , అందుబాటులో వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

### యూరియా కొరత రాకుండా చూడాలి

యూరియా కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ టీములు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ స్టాకు వివరాలు పరిశీలించాలని ఆదేశించారు. వ్యాపారులు ఎరువులు నిల్వ వివరాలు నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తామని ఏదేని వ్యత్యాసం వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాకు 25 వేల టన్నుల యూరియా వచ్చిందని, అదనంగా 5 వేలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా యూరియా సరఫరా చేయాలని తెలిపారు. ఆధార్ నమోదుతో మాత్రమే యూరియా ఇవ్వాలని తెలిపారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే పిడి యాక్టు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఇరిగేషన్ ఈఈలు బసవ ప్రసాద్, యాదగిరి, తిరుపతి రావు, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయ శాఖ ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలుగా బచ్చలకూరి సుగుణ



సూర్యాపేట, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణ అధ్యక్షురాలుగా బచ్చలకూరి సుగుణ నియమితులయ్యారు. గురువారం హుజూర్నగర్ లోని పార్టీ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి చేతుల మీదుగా తన నియామక ఉత్తర్వులను అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన తోటి మహిళలను చైతన్యపరచి పార్టీ సూచనలతో ముందుకెళ్తామన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులు అనురాధ మరియు పార్టీ మండల అధ్యక్షులు కొనతం చిన్న వెంకటరెడ్డి పట్టణ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ మునిసిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ అలక సరిత సైదిరెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏనుకుంటా రిజర్వాయర్ ఆయకట్టు తలరాత మార్చేది ఎవరు

**13 ఏళ్లుగా పారని సాగునీరు**

**అడుగడుగుతున్న బోర్లు నీళ్లు**

**రైతులకు సాగునీరు అందించని ఆయకట్టు ఎందుకు**

**అన్నదాతలను ఏడిపిస్తున్న ఆయకట్టు**

**కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు**

**ముండ్లపొదలు జమ్మూ సిల్టు చెత్త చెదారం**

**రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకొని ఆయకట్టుకు నీళ్లు అందించాలి.**



దేవరకద్ర ప్రతినిధి,ఫిబ్రవరి21(తీన్మార్ న్యూస్) చివరి ఆయకట్టు గ్రామాలకు నీరు అందించి పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని ఆయకట్టు రైతు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. రైతుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. ఆరుగాలం శ్రమించి వరినాట్లు వేసిన రైతన్నలకు నిరాశే మిగులుతోంది. కాలువల్లో చుక్కనీరు లేక ఆందోళన చెందుతున్నారు.వేలకు వేలు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు పొట్ట దశలో నీళ్లు లేక కండ్ల ముందు చూస్తూ రైతులు తల్లడిల్లుతున్నారు.

### ఆయకట్టు రైతులు 13 ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూపులు

వనపర్తి జిల్లా మదనాపురం మండలం,కొత్తకోట మండలం పరిధిలో భారీ నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్ట్ -2 ఆమడబాకుల ఏనుకుంట రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టు పనులు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తేది 22/08/2005 సంవత్సరంలో నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య,వనపర్తి ఎమ్మెల్యే డా" జి.చిన్నారెడ్డి భూమి పూజ చేశారు.7 సంవత్సరాలలో ఏనుకుంట రిజర్వాయర్ పనులు పూర్తి కావడంతో ఆనాటి రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి,నీటిపారుదల శాఖ మంత్రి సుదర్శన్ రెడ్డి మరియు దేవరకద్ర ఎమ్మెల్యే సీతా దయాకర్ రెడ్డి,వనపర్తి ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి రిజర్వాయర్ కు నీళ్లు విడుదల చేసి ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుంచి నేటి వరకు కాలువలో చుక్క నీరు పారగా రైతులకు చుక్కలు చూపిస్తున్న ఏనుకుంట ఆయకట్టు కాలువ 13 సంవత్సరాల నుంచి ఆయకట్టు సాగు కాలువలను పాలకులు అధికారులు పట్టించుకోకపోవడంతో వడ్డెవాట,వడ్డెవాట తాండ,తీర్మాలయాపల్లి,ఆజ్జకొల్లు, చర్లపల్లి ఆయకట్టు పరిధిలోని దాదాపుగా 3 వేల ఎకరాల వరకు సిస్తూ సాగు అవుతుందని రైతుల అంటున్నారు.కాలువల ద్వారా నీళ్లు ముందుకు వెళ్లలేక పిచ్చిమొక్కలు,ముండ్లపొదలు, జమ్మూ,సిల్టు మరియు చెత్త చెదారం కాలువల విపరీతంగా పెరుకపోవడంతో చివరిదాకా నీళ్ళు పారక రైతులకు సాగునీరు అందక నానా అవస్థలు పడుతున్నారు.సాగునీళ్లు లేక కొందరు రైతు పొలాలు బీడు భూములుగా మారాయి.రాష్ట్ర ప్రభుత్వం ఆయకట్టు సాగునీటి సమస్యలను పరిష్కరించి, రైతులకు సాగునీటి కష్టాలు తీర్చాలి.ఇప్పటికైనా నీళ్లు ఇస్తే ఉన్న పంటలను కాపాడుకుంటామని రైతులు ప్రాధేయ పడుతున్నారు.





# ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారీ తో కలిసి ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు,రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 20 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి 12 వరకు పరిక్షలు జరుగుతాయని, జిల్లాలో 9,302 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్డులు 4,392, రెండవ సంవత్సరం విద్యార్డులు 4,910 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి,ఇందుకోసం కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్పీ తిరుపతి రావు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్.డి.ఓలు కృష్ణవేణి, గణేష్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్. మదార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్, ఆర్.టి.సి అధికారి జి. శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి , మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్ ఎన్. రవీందర్, పోస్టల్ అధికారి ప్రభాకర్ ఎన్.పి.డి.సి.ఎల్ అధికారులు, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ వెల్లడి**

**బ్యాలెట్ బాక్సుల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష జరిపిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో, నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్,రెవెన్యు అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారీ తో కలిసి సమీకృత జిల్లా సముదాయాల కార్యాలయం వీ.సీ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, రిసెప్షన్ సెంటర్ కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులతో మాట్లాడుతూ, ఈ.సీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదు-పాయాలను సరిచూసుకోవాలని అన్నారు. షామియానాలు, తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లపై చేపట్టిన చర్యల గురించి రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ రిసెప్షన్ సెంటర్ కు తరలించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఓటింగ్ పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేవిధంగా విధులు నిర్వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ జరపాలని, ఆయా పోలింగ్ కేంద్రాలలో కొనసాగే ఓటింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు కృష్ణవేణి, గణేష్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఈసీ మెంబర్‌గా తాటి ధనాకర్ నియామకం



## జిల్లా అధ్యక్షులు కాడపాక రాజశేఖర్ వర్మ

ములుగు, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): బహుజన్ సమాజ్ పార్టీ(%దీర్ఘా%) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు నూగూరు వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన తాటి దనాకర్ నీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించడం జరిగిందని ములుగు జిల్లా బీఎస్పి అధ్యక్షులు కాడపాక రాజశేఖర్ వర్మ అన్నారు.ములుగు జిల్లా లో ఉన్న ప్రతి మండలం, గ్రామంలో పార్టీ నీ బలోపేతం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా ప్రయాణం చేస్తామని అన్నారు. అగ్రకుల పార్టీ లు మనలను బానిసలుగా వాడుకొని మద్యం,డబ్బు,,ఆశ చూపెట్టి మన ఓట్లను వారి గెలుపుకు ఉపయోగిస్తున్నారు. జనాలలో ఓటు చైతన్యం చేసి, అధికారానికి దూరంగా ఉన్న కులాలకు అధికారం అందచేయడమే బహుజన్ సమాజ్ పార్టీ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో అగ్రకుల పార్టీలకు ఓటు రూపకంగా బుద్ధి చెప్పి బహుజన్ సమాజ్ పార్టీ నీ గెలుపే దిశగా ప్రయాణం కొనసాగిస్తామన్నారు. తదనంతరం నూతనంగా బహుజన్ సమాజ్ పార్టీలో చేరబోయే కార్యకర్తలు మహేష్, సమ్మయ్య, కుమార్, సాయిరాం, బాబూరావు, విజయ్, పవన్ కుమార్ లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# పన్నెండు నెలలలో ఎంతో అభివృద్ధి చేశాం

అధికారంలోకి రాగానే

55 వేల ఉద్యోగాలు ఇచ్చాం.

ఏడాదికి 5 లక్షల ఇండ్లు ఇస్తున్నాం.

రాబోయే రోజుల్లో దేశంలోనే రాష్ట్రాన్ని

అగ్రగామిగా నిలుపుతాం.

నారాయణపేట ప్రజా పాలన ప్రగతి బాట

సభలో సీఎం రేవంత్ రెడ్డి



మహబూబ్నగర్ ఫిబ్రవరి 21 తీన్మార్ న్యూస్:- కేవలం 12 నెలల్లో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈ విషయంలో ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం నారాయణ పేట జిల్లా పర్యటన సందర్భంగా దాదాపు 1000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి అప్పక్ పల్లి లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆడ బిడ్డలకు ఆలంబన ఇవ్వాలని దేశంలో ఎక్కడ లేని విధంగా నేడు మహిళా సమాఖ్యాల ద్వారా పెట్రోల్ బంక్ నడిపించుకునే విధంగా పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 10 సంవత్సరాలు బడుగు బలహీన వర్గాల ప్రజలను విస్మరించిందని విమర్శించారు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశాక ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసుకొని ఈరోజు నారాయణపేట నుంచి భూమి పూజ చేసుకోవడం జరిగిందన్నారు. అవసరం అనుకుంటే నియోజకవర్గానికి 5 వేలకు పెంచుతామని పేర్కొన్నారు. హైదారాబాద్ రాష్ట్రానికి పాలమూరు జిల్లావాసి బూర్గుల రామకృష్ణ రావు తొలి ముఖ్యమంత్రి గా పనిచేస్తే దాదాపు 7 దశాబ్దాల తర్వాత తిరిగి పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందన్నారు. ఈ అవవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెనకబడ్డ ఈ పాలమూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటానని హామి ఇచ్చారు. పాలమూరు జిల్లా గుండా సంవత్సరానికి 811 టి.యం.సి ల నీరు పోతుంటే పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయకుండా జిల్లాను ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో లేదా అని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్.డి ఎస్, కల్వకుర్తి, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా 10 ఏళ్లు నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. పైగా పోతిరెడ్డి పాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీళ్లు తరలించుకుపోయేందుకు అవకాశం కల్పించారని పరోక్షంగా మాజీ సీఎం కే సి ఆర్ ను ఉద్దేశించి విమర్శించారు. మక్తల్, కొడంగల్, నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణానికి 2014లో కోట్లాడి మంజూరు చేయిస్తే తనపైన ఉన్న కోపంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా ఆపేశారని అన్నారు. ఇప్పుడు తన హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదండాపూర్, పాలమూరు రంగారెడ్డి, ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామి ఇచ్చారు. లగ చర్లలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తే అడ్డుకున్నారని, పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకుంటే ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం 12 నెలలు పూర్తి అయ్యిందని, భారాస ప్రభుత్వం చేసిన 10 సంవత్సరాల పాలన, కేంద్రంలో 12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం పాలన పై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని, నన్ను కాపాడుకునే బాధ్యత ప్రజల పై ఉందని అన్నారు. ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆగష్టు 1, 2024 న సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనల మేరకు 120 రోజుల్లో విజవంతంగా కుల గణన పూర్తి చేయడం జరిగిందని దానితో పాటు వర్గీకరణ పూర్తి చేసి అన్ని విధాలుగా వెనుకబడిన మాదిగ కులానికి 9.7 శాతం రిజర్వేషన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు మాత్రమే అవుతుందని ఈ 14 నెలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశామని తెలిపారు. 10 సంవత్సరాల పరిపాలన చేసిన గత ప్రభుత్వం 8 లక్షల కోట్లు అప్పు చేసి మరో 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టీ ఇచ్చిన హామీలు ఏమయ్యిందినని అడుగుతున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో వేదిక ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అంతకు ముందు నారాయణపేట శాసన సభ్యులు చిట్టెం పర్ణికా రెడ్డి, మంత్రులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నారాయణ పేట జిల్లాలో దాదాపు 967 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. 56 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 130 కోట్ల అంచనా వ్యయంతో వైద్య కళాశాల నూతన హాస్టల్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ కు శంఖుస్థాపన చేశారు. 26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనం, 40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల యూనిట్ కు శంఖుస్థాపన చేశారు. రూ. 5.58 కోట్ల వ్యయంతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేటలో నిర్మించిన రూరల్ పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. 1.23 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్ ను ప్రారంభోత్సవం చేశారు. 295 కోట్ల అంచనా వ్యయంతో తుంకిమెట్ల నారాయణపేట రోడ్, కోటకొండ మద్దూరు రోడ్ అభివృద్ధి పనులు, అప్పక్ పల్లి గుండిమాల్ రోడ్, మద్దూరు లింగాల్ చెడ్ రోడ్ లలో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 193 కోట్ల నిధులతో గుల్బర్గా కొడంగల్, రావులపల్లి మద్దూరు, కొస్గి దౌల్తాబాద్ రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. రూ.12.70 కోట్ల నిధులతో నారాయణపేట నియోజకవర్గ పరిధిలో సి.ఆర్.ఆర్. రోడ్లకు శంఖుస్థాపన చేశారు. 7 కోట్లతో మరికల్ లో నిర్మించిన మండ్లపరిషత్ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డి.జి.పి జితేందర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, నారాయణపేట శాసన సభ్యులు పర్ణిక రెడ్డి, మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి రెడ్డి, మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

హుజురాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి రేవూరి ప్రకాశ్ రెడ్డి

హుజురాబాద్ నియోజకవర్గం చైతన్యవంతమైనది

పార్టీ అభ్యర్థి గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

పార్టీ కో-ఆర్డినేటర్ ల సమావేశంలో ఎంఎల్ఏ రేవూరి



హుజురాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని, హుజురాబాద్ నియోజకవర్గం నుంచి మంచి మెజారిటీ ఇవ్వాలని పరకాల ఎమ్మెల్యే రెవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణ,మండల కో-ఆర్డినేటర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గం నుండి సత్తా చాటాలని కో-ఆర్డినేటర్ లను కోరారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓటరును నేరుగా కలవాలని సూచించారు. ప్రతి కార్యకర్త కష్టపడితేనే విజయం సాధిస్తామని తెలిపారు. పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అది ఓటర్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, మాదకద్ర వ్యాల వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలో ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో మాదకద్రవ్యాల నిషేధం ( నార్కోటిక్ డ్రగ్స్ )పై సంబంధిత అధికారులతొ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యా%శీ%టీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారా? లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యా%శీ%టీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్ పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టలని అన్నారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా అబ్కారీ శాఖ అధికారులు కూడా మాదకద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతత్వంలోనూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల నెలవారి సమావేశాలలో డ్రగ్స్ నిషేధం గురించి తెలిపి క్షేత్రస్థాయిలో వారి ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇక ముందు జరిగే యాంటి నార్కోటిక్ సమావేశాలకు ఆయా శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధంపై నిర్వహించిన కార్యక్రమాల నివేదికను తయారుచేసి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిగా నిషేధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, డి సి ఆర్ బీ డిఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, డిఇఓ వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుని విమర్శించే స్థాయి జగదీష్ రెడ్డికి లేదు

టీడీపీ సీనియర్ నాయకులు ఇంజమూరి వెంకటయ్య



సూర్యాపేట, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డికి లేదని నల్లగొండ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఇంజమూరి వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని విమర్శించే స్థాయి కాదనేది జగదీశ్ రెడ్డి గుర్తుకు చేసుకోవాలని, హుజూర్ నగర్ నియోజకవర్గంలో పోటీ చేసినపుడు నీ మెడకు తెలుగుదేశం కండువాతో ఓట్లడిగిన విషయం గుర్తుంచుకోవాలని చంద్రబాబు నాయుడు పట్ల మాట్లాడిన దానిపట్ల బహిరంగ క్షమాపణ చెప్పాలని సంక్షేమానికి మారు పేరు తెలుగుదేశం పార్టీ అన్నారు. సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ వర్గాల పుణ్యాన గెలిచి ప్రజలకు వరగబెట్టి నట్లు అహం చూపించే ముందు నీ గెలుపు లో రెండు సార్లు వచ్చిన మెజారిటీ ఎంతో ఆత్మపరిశీలన చేసుకోవాలని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సెంటిమెంట్ తో అమాయక ప్రజల పుణ్యాన అధికారంలోకి వచ్చింది టీఆర్ఎస్ పార్టీ అనీ మానవ జన్మ నవ మాసాలకు ఎట్లనో పార్టీ పెట్టిన నవ మాసాలకే ప్రజా హృదయాల నండి అధికారంలోకి వచ్చింది తెలుగు దేశం పార్టీ అని నేడు దేశంలోనే కీలక పాత్ర పోషించేదే తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడని, మరొక్క సారి టీడీపీ పట్ల గానీ, చంద్రబాబు నాయుడు పట్ల గానీ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని పత్రికా ముఖంగా కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పచ్చిపాల వెంకన్న యాదవ్,చందమళ్ళ వెంకన్న పాల్గొన్నారు.

## మండలాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): శుక్రవారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి మండలాలలోని కెజిబివి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర%శీ%, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టళ్ళ లోని నిత్యావసర సరకులను, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని అధికారులకు తెలిపారు. నిత్యావసర సరకుల సామాగ్రిని పంపిణీ చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్ధులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్ధులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా, విద్యార్థులందరూ 10 GPA సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. తరచుగా ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలని, ఒక్కొక్క విద్యార్థి పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించి, చుట్టూ పరిసరాల పరిశుభ్రత మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు. ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్యసేవల ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రాథమిక పరీక్ష, ల్యాబ్ ను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని అన్నారు. ఈ తనిఖీలో స్థానిక మండలాల తహసిల్దార్ లు, మెడికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దు



ములుగు జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలి. ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి. పీఓలు, ఏపీఓ, ల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ,ఏపిఓ, సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకలింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26వ తేదీన ఉదయం 8.00 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్ లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడినదా లేదా అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకున్న మీదట తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల లోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నల్గొండ లోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీ.ఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పి.ఓలదే

అని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు.

ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పి.ఓ లు, ఏ.పీ.ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ. రాజ్ కుమార్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, పర్యవేక్షకులు సలీమ్, శివకుమార్, తదితరులు ఉన్నారు.

# రాబోయే స్థానిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**ఆదర్శ ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి**

**నోడల్ అధికారులు, స్టేజ్-1, 2 రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమం**

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**



జనగామ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రాబోయే గ్రామ పంచాయతీ/ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు గాను అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రజాపరిషత్/గ్రామ పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అధ్యక్షతన రాబోయే గ్రామ పంచాయితీ/ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్లు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్, కౌంటింగ్ విధులపై నోడల్ అధికారులు, స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ లతో ముందస్తు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రానున్న గ్రామ పంచాయతీ/ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం మొదలుకొని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ వరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని రకాల ఫార్మ్ లను జాగ్రత్తగా పూరించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ/ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, సమయానుగుణంగా ప్రతి అధికారి పూర్తి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి, వాటిని ఖచ్చితంగా అనుసరించాలన్నారు.

ఈ ఎన్నికలు బ్యాలెట్ పత్రాల ద్వారా జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, పూర్తిస్థాయిలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలో సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికలకు ఒకరోజు ముందే ఎన్నికల విధులు నిర్వహించు అధికారులు నిర్ణీత ప్రదేశానికి చేరుకొని తమకు కేటాయించిన ఎన్నికల సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ తనిఖీ, సీల్ వేయుట, తదితర ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. ఓటర్లు తమ వెంట ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటరు వెంట తెచ్చుకున్న గుర్తింపు కార్డులోని చివరి నాలుగు అంకెలను సంబంధిత ఫార్మ్ లో నమోదు చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల నియమనిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన కరదీపిక (హ్యాండ్ బుక్)ను చదువుకొని, సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఎటువంటిసందేహాలున్నా మండలాల వారీగా నియమించిన మాస్టర్ ట్రైనర్ లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. సమయపాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, ఎలాంటి ఆక్షేపణలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొత్తం (2543) పోలింగ్ కేంద్రాలు, ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం పోలింగ్ కేంద్రాలు (783) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్-1 ఆర్ఓలు (75) మంది, ఏఆర్ఓలు (150) మంది.. స్టేజ్-2 ఆర్ఓలు (75) మంది, ఏఆర్ఓలు (150) మంది.. జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్ఓలు (13) మంది, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఆర్ఓలు (55) ఏఆర్ఓలు (55)గా ఎంపీడీవోలు, ఎంపీఓలు ఈ శిక్షణకు హాజరయ్యారు. అంతకుముందు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల విధుల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ సీఈఓ మాధురీ షా, డిప్యూటీ జెడ్పీ సీఈఓ సరిత, డిపిఓ స్వరూప, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ఎమ్మెల్సీ ఎన్నికలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్.. పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు**




సూర్యాపేట, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెజస్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లాల కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్, యస్పి సన్ ప్రీత్ సింగ్ తో కలిసి పాల్గొన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదీర్ఘంగా చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు 23 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ అందించామని అన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్ లను నేరుగా నల్గొండ తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు.ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు రిపోర్ట్ అందించేలా వ్యవస్థ సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న యస్పి సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో అధనపు కలెక్టర్ పి.రాంబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి వేణు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివితే ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువొచ్చు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**

**వరంగల్ ఎన్ఐటి విద్యాసంస్థను సందర్శించిన పీఎంశ్రీ విద్యార్థులు**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదివినట్లయితే దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివే అవకాశం లభిస్తుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం వరంగల్ ఎన్ఐటిని పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాఠశాల జంటీకరణ(ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్) లో భాగంగా సందర్శించారు. ప్రతిష్టాత్మక జాతీయ విద్యా సంస్థ అయిన వరంగల్ ఎన్ఐటి లోని సాంకేతిక, సాంకేతికేతర విభాగాలు, వివిధ ప్రాజెక్టులను పీఎం శ్రీ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించి వాటిని గురించిన వివరాలను ఎన్ఐటి ప్రొఫెసర్లతో పాటు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఐటి లోని ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో 9, 10, ఇంటర్మీడియట్ విద్య అనేది జీవితంలో ఎంతో ముఖ్యమైనదని, ఆ మూడు సంవత్సరాలు కష్టపడి చదివినట్లయితే ఎన్ఐటి లాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువొచ్చన్నారు. ఆ మూడు సంవత్సరాల పాటు కష్టపడి చదివినట్లయితే జీవితంలో ఉన్నత స్థానానికి చేరతారని అన్నారు. వరంగల్ ఎన్ఐటి లాంటి విద్యాసంస్థల్లో చదవాలని ఉంటే జేఈఈ మెయిన్స్ రాయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని ఇంజనీరింగ్ మెడిసిన్ విద్యలో అభ్యసించేందుకు జేఈఈ, నీట్ లో మెరుగైన ర్యాంకులను సాధించాలన్నారు. దేశంలో అనేక ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటి విద్యాసంస్థలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బాగా చదివి వాటిల్లో సీట్లు సాధించాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా విద్యాశాఖ వాసంతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులకు పట్టణాలలోని విద్యా సంస్థలకు చెందిన విద్యార్థుల మాదిరిగా వారి భావి జీవితాన్ని రూపుదిద్దుకుంటారని ఉద్దేశంతో పీఎం శ్రీ లో భాగంగా వరంగల్ ఎన్ఐటి ని సందర్శించే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని దానిని చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎంతగానో వెచ్చిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు ఎన్ఐటిని సందర్శించేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. అంతకుముందు వరంగల్ ఎన్ఐటీని సందర్శించి వేటిని గురించి తెలుసుకున్నారని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అందుకు విద్యార్థులు స్పందిస్తూ ఎన్ఐటి విద్యాసంస్థల సందర్శించడం ద్వారా సాంకేతిక, విజ్ఞాన విషయాలను తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంస్థను సందర్శించడం ద్వారా భవిష్యత్తులో తాము కూడా ఇలాంటి విద్యాసంస్థలో చేరడానికి స్ఫూర్తిని కలిగించిందన్నారు. విద్యాసంస్థల్లో చదివేందుకు తాము తప్పకుండా కష్టపడి చదువుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటి స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ అన్వేష్, విద్యాశాఖ అధికారులతో పాటు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వి-హబ్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



హనుమకొండ, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): మహిళా సాధికారత దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, మ్యానుఫాక్చరింగ్ యూనిట్ ను ప్రణాళికతో ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డీఆర్డీఏ, వి-హబ్ అధికారులతో దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న పరకాల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు కలెక్టర్ సమీక్షించారు. ఉదయం ల్యాదెల్ల లో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను వి-హబ్( ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్ హబ్ ) ప్రతినిధులు, ఇతర అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి కి, ఉత్పత్తి తయారీకి సంబంధించి వార్షిక ప్రణాళిక ను సమన్వయంతో రూపొందించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణకు అభ్యర్థుల ఎంపికను పూర్తిచేయాలన్నారు. వివిధ శాఖలను సమన్వయంతో పనిచేసేవిధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత కు చేయూత అందించే విధంగా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేయనున్నట్లు పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ పరిధిలోని మహిళా గ్రూపులకు ఏయే అంశాల్లో శిక్షణను నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణానంతరం మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ నెలకొల్పడానికి ఉన్న అవకాశాలను వి-హబ్ సహకారంతో అంచనా వేసేందుకు వి-హబ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా అక్కడ పరిశీలించిన అంశాలను కలెక్టర్ కు వివరించారు. డీఆర్డీఏ, వి-హబ్ ఆధ్వర్యంలో ల్యాదెల్లలో నైపుణ్యాభివృద్ధి, మాన్యూఫాక్చరింగ్ హబ్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, వి- హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహా సజ్జ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టండి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): వర్ధన్నపేట ఎస్సారెస్పీ ప్రధాన కాలువను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ సాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపటట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని వర్ధన్నపేట ఎస్సారెస్పీ ప్రధాన కాలువను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో నీటి లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ ప్రధాన కాలువ ద్వారా వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లోని రావూరు, ధూప తండా, కల్లెడ పర్వతగిరి తదితర తదితర గ్రామాలలోని నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటూ రైతుల పంటలు నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఇరిగేషన్ ఇంజనీర్ శంకర్ చౌహాన్ డి ఈలు కిరణ్ కుమార్, ఎన్ రాజు ఏఈలు తదితరులు ఉన్నారు.



## దివ్యాంగ బాలల ఉజ్వల భవిష్యత్‌కు భవిత కేంద్రాలు తోడ్పాటును ఇస్తున్నాయి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లానందు కొత్తగూడెం రైటర్ బస్తీలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని (భవిత ) జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సందర్శించారు. అన్ని రకాల వైకల్యాల గల పిల్లలకు కావలసిన ఉపకరణాల గురించి భవిత సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది. స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, ఆడియాలజిస్ట్ అవసరాన్ని, జిల్లాలో నిర్వహిస్తున్న సమ్మిళిత విద్యా విధానం గురించి ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ యస్. కె. సైదులు కలెక్టర్ కు వివరించారు. భవిత పాఠశాల ఆవరణలో గల పాత భవన నిర్మాణాన్ని తొలగించి వారికి ఆట స్థలం ఏర్పాటు అయ్యేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తదుపరి పాల్వంచ భవిత కేంద్రాన్ని కూడా ఈ సందర్భంగా సందర్శించి దివ్యాంగ పిల్లలతో ఇంటరాక్ట్ అయి పిల్లల ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా అబ్దుల్ అజీజ్ అనే విద్యార్థి భవిత కేంద్రం లో అందించిన ఫిజియో థెరపి ద్వారా, మంచానికి పరిమితం అయిన స్థితి నుండి స్వయంగా నిలబడి, నడవగలిగే స్థితికి వచ్చిన విద్యార్థి యొక్క సక్సెస్ స్టోరీని స్వయంగా విని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం %×ు×% చదువుతున్న అబ్దుల్ అజీజ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కేంద్రాన్ని సందర్శించడం జరిగిందని, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తుకు సంబంధించి చర్చించడం జరిగిందన్నారు. పిల్లలు దేవుడిచ్చిన వరంగా భావించాలని, వారి నైపుణ్యాలను తీర్చిదిద్ది, స్పెషల్ స్కూల్ నుంచి నార్మల్ స్కూల్ కు మెయిన్ స్ట్రీమ్ చేయడానికి ఇక్కడున్న సిబ్బంది కృషి చేస్తున్నారని, ప్రత్యేక అవసరాల పిల్లలకు కావలసిన ఉపకరణాల గురించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న కాలంలో దివ్యాంగ పిల్లలకు సమ్మిళిత విద్యను భవిత కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో అందించేందుకు చేపట్టవలసిన కార్యకలాపాలపై పక్కా ప్రణాళిక ను రూపొందించి దివ్యాంగ పిల్లలకు మంచి భవిష్యత్ ను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి, సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ యస్. కె. సైదులు, మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి, రిసోర్స్ పర్సన్ లు శ్రీరామ్, కనక దుర్గా, అరుణ కుమారి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# 'ఎప్పటికైనా మీలా అవుతా'..

## జొమాటో సీఈఓకు 8 ఏళ్ల బాలిక లేఖ




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో.. ఫుడ్ డెలివరీతో పాటు తన యాప్ ద్వారా 'ఫీడింగ్ ఇండియా' కార్యక్రమానికి విరాళాలు సేకరిస్తుంటుంది. వీటి ద్వారా ఎంతో మందికి సాయం చేస్తుంటుంది. ఇప్పటి వరకు ఈ కార్యక్రమం కింద 19 కోట్ల మంది ఆకలి తీర్చగలిగామని ఆ కంపెనీ సీఈఓ దీపిందర్ గోయల్ తెలిపారు. యూజర్ల చొరవతోనే ఇదంతా సాధ్యమైందంటూ కొనియాడారు. అంతేకాదు.. తాము చేస్తున్న కృషిని అభినందిస్తూ ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తనకు రాసిన లేఖను సైతం తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "రోజూ మా ఆకలి తీరుస్తున్న ఫీడింగ్ ఇండియా టీమ్‌కు ధన్యవాదాలు. మా గురించి కూడా ఆలోచించే వారు ఉండటం ఆనందం కలిగిస్తోంది. మాతో వ్యక్తిగతంగా పరిచయం లేకపోయినా చాలా సాయం చేస్తున్నారు. మీరు చేస్తున్న ఈ పని చాలా మంది జీవితాల్లో మార్పు తెచ్చింది. నేను బాగా చదువుకుంటున్నాను. ఏదో ఒక రోజు నేను కూడా మీలానే ఇతరులకు సాయం చేసి, ప్రేమను పంచే వ్యక్తిగా ఉండాలని కోరుకుంటున్నాను" అని ఆ విద్యార్థి తన లేఖలో రాసుకొచ్చింది. ఈ లేఖపై స్పందిస్తూ.. తాము చేస్తున్న పనికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ గోయల్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఎన్‌జీఓ గురించి మరిన్ని అప్‌డేట్‌లు త్వరలో అందిస్తామన్నారు. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం.. దేశంలో ఆకలితో అలమటిస్తున్న వారికి, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి వారి ఆకలి తీర్చేందుకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా నడుపుతున్న సంస్థ ఈ ఫీడింగ్ ఇండియా.




# కేరళలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు

## - అదానీ గ్రూప్

అదానీ గ్రూప్ వచ్చే ఐదేళ్లలో కేరళలో రూ.30 వేల కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోందని అదానీ పోర్ట్స్, లిమిటెడ్, కరణ్ అదానీ ప్రకటించారు. రూ.5,500 కోట్ల పెట్టుబడితో తిరువనంతపురం ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని ఏడాదికి 45 లక్షల ప్రయాణికుల నుంచి 1.20 కోట్లకు సరిపడా విస్తరించ నున్నట్లు ఆయన తెలిపారు. అలాగే, కొచ్చిలో లాజిస్టిక్స్, ఈ-కామర్స్ హబ్‌ను ఏర్పాటు చేస్తామనిబీ అదే ప్రాంతంలో సిమెంట్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతామని ఆయన తెలిపారు. అదానీ గ్రూప్ కేరళలో పోర్టును అభివృద్ధి చేస్తోంది, ఇప్పటికే రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్‌లో అదానీ పోర్ట్స్ సెజ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, కరణ్ అదానీ కేరళలో పెట్టుబడి ప్రణాళిలను ప్రకటించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దాదాపు 3,000 మంది పాల్గొనే అవకాశం ఉంది.

# కొత్త ఈవీ పాలసీ ఊహాగానాలు..

## టాటా, మహీంద్రా షేర్లు డౌన్



ప్రముఖ కార్ల తయారీ సంస్థలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు ఆహ్వానం పలికేందుకు కేంద్రం కొత్త ఈవీ పాలసీని తీసుకురాబోతోందన్న వార్తల నేపథ్యంలో ఈ ఉదయం ఆయా కంపెనీల షేర్లు ఆరు శాతం వరకు నష్టపోయాయి. దేశంలోకి అమెరికా కార్ల తయారీ సంస్థ టెస్లా ఎంట్రీ దాదాపు ఖరారైంది. అయితే, సుంకాలు మరింత తగ్గించాలని ఆ కంపెనీ కోరుతోంది. ఈనేపథ్యంలో టెస్లా కోసం ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని మరింత సులభతరం చేస్తూ తీసుకురాబోతోందంటూ వార్తలు వస్తున్నాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే విదేశీ కార్లు దేశీయ మార్కెట్లో ప్రవేశించేందుకు వీలు పడుతుంది. అప్పుడు దేశీయ కార్ల తయారీ కంపెనీలకు గట్టి పోటీ ఏర్పడుతుంది. ఈ భయాల నేపథ్యంలో ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయని నిపుణులు చెబుతున్నారు. ఈక్రమంలో నిఫ్టీ ఆటో సూచీ 2 శాతం మేర నష్టపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6 శాతం, టాటా మోటార్స్ 2 శాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం ఈవీ కార్ల మార్కెట్‌లో ఈ రెండూ మెజారిటీ వాటా కలిగిఉన్నాయి. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. మధ్యాహ్నం 1.15 గంటల సమయానికి సెన్సెక్స్ 445 పాయింట్ల నష్టంతో 75,290.42 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 133 పాయింట్లు నష్టపోయి 22,779 వద్ద ట్రేడవుతోంది.

# పేటీఎం నుంచి సోలార్ సౌండ్ బాక్స్..




ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం మాతృసంస్థ 'వన్ 97 కమ్యూనికేషన్స్'.. సోలార్ సౌండ్‌బాక్స్‌ను లాంచ్ చేసింది. భారత్‌లో మొట్ట మొదటిసారిగా సౌరశక్తితో నడిచే సౌండ్ బాక్స్‌ను తీసుకొచ్చింది. తక్కువ సూర్యకాంతితో ఛార్జ్ అయ్యేలా వీటిని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. వ్యాపారులకు విద్యుత్ ఖర్చుల్ని తగ్గించేందుకు వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు పేటీఎం వెల్లడించింది. పేటీఎం సోలార్ సౌండ్ బాక్స్‌లు పైభాగంలో సోలార్ ప్యానెల్‌ను కలిగిఉంటాయి. ఈ బాక్స్‌ను సూర్యకాంతి తగిలేలా ఉంచితే ఆటోమెటిక్‌గా ఛార్జ్ అవుతుంది. డ్యూయల్ బ్యాటరీతో దీన్ని తీసుకొచ్చారు. ఇందులో ఒక బ్యాటరీ సౌరశక్తితో ఛార్జ్ అయితే, మరొకటి కరెంట్‌తో ఛార్జ్ చేయొచ్చు. సౌరశక్తితో 2-3 గంటలు ఛార్జ్ చేస్తే రోజు మొత్తం పనిచేస్తుందని కంపెనీ చెబుతోంది. ఇక కరెంట్‌తో ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే 10 రోజుల వరకు వస్తుందని తెలిపింది. 4జీ కనెక్టివిటీకి సపోర్ట్ చేసే ఈ సౌండ్‌బాక్స్ 3 స్పీకర్‌తో వస్తోంది. 11 భాషల్లో ఆడియో నోటిఫికేషన్‌కు సపోర్ట్ చేస్తుంది.

వరుడి సిబిల్ స్కోరు తక్కువగా ఉందని ఇటీవల మహారాష్ట్రలో ఒక పెళ్లి ఆగిపోయిన సంగతి గుర్తుందా.. విషయం ఏమిటంటే.. పెళ్లి కొడుకు ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలని వధువు మేనమామ అనుకున్నారు. అబ్బాయి క్రెడిట్ స్కోరును పరిశీలించాలని పట్టుబట్టారు. వాటిని చూసి, క్రెడిట్ స్కోరు 600 కన్నా తక్కువగా ఉందని, పలు బ్యాంకుల్లో రుణాలున్నాయని తెలుసుకున్నారు. దీంతో అమ్మాయికి ఆర్థిక భద్రత కల్పించలేరని చెప్పి, ఆ వివాహాన్ని రద్దు చేసుకున్నారు. ఇది కాస్త ఆశ్చర్యం కలిగించే విషయమే. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది తప్పనిసరిగా పరిశీలించాల్సిన విషయం అని వ్యక్తిగత ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.




# పెళ్లికి ముందే క్రెడిట్ స్కోరు తెలుసుకోండి

వివాహం.. జీవితంలో ఒక కీలక దశ. ఇద్దరు వ్యక్తులు కలిసి కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం. ప్రేమ, నమ్మకం, అవగాహన వంటివి ఎంత ముఖ్యమో.. ఆర్థిక విషయాలూ అంతే ప్రధానం. ఈ నేపథ్యంలో కాబోయే జీవిత భాగస్వామి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకోవడం చాలా అవసరం. దీనికి అందుబాటులో ఉన్న మార్గం క్రెడిట్ స్కోరును పరిశీలించడం. ఇది 750కి మించి ఉంటేనే బాగున్నట్లు లెక్క. క్రెడిట్ స్కోరు వ్యక్తి ఆర్థిక చరిత్రకు అద్దం లాంటిది. తీసుకున్న రుణాలు, వాటి చెల్లింపుల తీరు, క్రెడిట్ కార్డుల వినియోగం, ఎన్నిసార్లు అప్పుల కోసం దరఖాస్తు చేశారు? తదితర ఎన్నో వివరాలను తెలియజేస్తుంది. ఆర్థిక క్రమశిక్షణ ఎలా ఉందో ఈ నివేదికను చూస్తే స్పష్టమవుతుంది.

**ఆర్థిక పారదర్శకత:** పెళ్లికి ముందు ఆర్థిక విషయాల గురించి మాట్లాడుకోవడం కొంచెం ఇబ్బందిగానే అనిపించవచ్చు. కానీ, ఇది చాలా ముఖ్యమైన విషయం అని గుర్తుంచుకోవాలి. కాబోయే భాగస్వామి క్రెడిట్ స్కోరు గురించి తెలుసుకోవడం వల్ల వారిద్దరి మధ్య ఆర్థిక పారదర్శకత పెరుగుతుంది. భవిష్యత్తులో డబ్బుకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది.

**భవిష్యత్తు ప్రణాళిక:** కాబోయే భాగస్వామి క్రెడిట్ స్కోరు వారి ఆర్థిక భవిష్యత్తును అంచనా వేసేందుకు సహాయపడుతుంది. ఉదాహరణకు క్రెడిట్ స్కోరు తక్కువగా ఉంటే రుణాలకు అధిక వడ్డీ రేటు చెల్లించాల్సి వస్తుంది. ఇది మీ ఉమ్మడి ప్రణాళికలను ప్రభావితం చేస్తుంది. ఇల్లు కొనడం, పిల్లల చదువు, పదవీ విరమణ వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ క్రెడిట్ స్కోరు ఉపయోగపడుతుంది.

రుణాల నిర్వహణ: డబ్బు గురించి మీ భాగస్వామికి ఎలాంటి ఆలోచన ఉందన్న విషయాన్ని క్రెడిట్ స్కోరు స్పష్టం చేస్తుంది. తీసుకున్న అప్పులను ఎంత క్రమశిక్షణతో చెల్లిస్తున్నారన్నదీ తెలుసుకోవచ్చు. కాబోయే భాగస్వామికి అప్పులు ఉన్నప్పుడు వాటిని ఎలా తీర్చబోతున్నారు, అందుకు వేసుకున్న ప్రణాళికలనూ కలిసి చర్చించుకోవచ్చు. క్రెడిట్ స్కోరు బాగాలేకపోతే దాన్ని మెరుగుపర్చుకునేందుకు ఒకరికొకరు సహాయం చేసుకోవచ్చు.

**నమ్మకం:** ఆర్థిక విషయాల్లో పారదర్శకత ఇద్దరి మధ్యా నమ్మకాన్ని పెంచుతుంది. దీనివల్ల భవిష్యత్తులోనూ ఎలాంటి మనస్పర్థలూ రాకుండా ఉంటాయి. ఉమ్మడి లక్ష్యాలు: ఇద్దరూ కలిసి ఉమ్మడి ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు క్రెడిట్ స్కోరు ఉపయోగ పడుతుంది. ఇద్దరూ కలిసి ఇల్లు కొనాలనుకుంటే.. క్రెడిట్ స్కోరు ఆధారంగా ఎవరికి ఎంత రుణం రావచ్చు, వడ్డీ రేట్లు ఎలా ఉంటాయన్న విషయంలో ఒక అంచనాకు రావచ్చు.

**ఖర్చుల నియంత్రణ:** క్రెడిట్ కార్డుల్లాంటివి వాడుతూ ఉంటే.. ఖర్చులను నియంత్రించుకొని, భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు ఏం చేయాలన్నదీ ప్రణాళిక వేసుకోవచ్చు. కాబోయే జీవిత భాగస్వామితో క్రెడిట్ స్కోరు, రుణాలు, ఆర్థిక ప్రణాళికల్లాంటివి చర్చించడం కొంచెం కష్టమే కావచ్చు. ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిందే. ఆలోచనల పరంగా ఎంతో ముందుంటున్న యువ జంటలు దీనిపై చర్చించేందుకు సందేహించకూడదు. ఇది మీ భవిష్యత్తుకు సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం. ఆర్థిక విషయాల్లో పారదర్శకత, అవగాహన మీ బంధాన్ని మరింత బలపరు-స్తుందని గుర్తుంచుకోండి.

# నాలుగో రోజూ నష్టాలే..

## 22,800 దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా ఆటో స్టాక్స్‌లో విక్రయాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6 శాతం, టాటా మోటార్స్ షేర్లు 2.46 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 22,800 దిగువకు చేరింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీల్లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అటు ప్రపంచ మార్కెట్లలోనూ వాణిజ్య యుద్ధ భయాలు కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ ఉదయం 75,612.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,735.96) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,112.41 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 7 పైసలు బలహీనపడి 86.71 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నష్టపోయాయి. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.90 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2944 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఆరోగ్య బీమా ప్రీమియానికి గాలి నాణ్యతతో లింక్



ఆరోగ్య బీమా జారీ చేసేటప్పుడు వయసు, బరువు, వ్యాధులు వంటివి ఆయా సంస్థలు పరిగణనలోకి తీసుకుంటాయి. దాని ఆధారంగానే ఆరోగ్య బీమా సంస్థలు ప్రీమియం నిర్ణయిస్తుంటాయి. ధూమపానం చేసే వారికి, చేయని వారికి కూడా వేర్వేరుగా ప్రీమియం ఉంటుంది. ఇకపై వాయు నాణ్యతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇన్సూరెన్స్ సంస్థలు భావిస్తున్నాయట. ముఖ్యంగా దేశ రాజధాని దిల్లీలో వాయు నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటున్న వేళ దీన్నీ పరిగణనలోకి తీసుకోవాలనుకుంటున్నాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. అదే జరిగితే దేశ రాజధాని దిల్లీ వాసులు ఇకపై ఆరోగ్య బీమాకు 10 నుంచి 15 శాతం మేర అధికంగా చెల్లించాల్సి రావొచ్చు. ప్రస్తుతం వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ అంశంపై చర్చిస్తున్నాయి. ఆపై బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను నిర్ణయించడంలో వాయు నాణ్యత పరిగనణలోకి తీసుకోవడం ఇదే తొలిసారి కానుంది. అంతేకాదు ఇతర నగరాల్లో బీమా ప్రీమియంలను పెంచుకొనేందుకు బీమా సంస్థలకు ఓ సాధనం కానుంది. వాయు నాణ్యత విషయంలో దిల్లీ నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది. వాహన కాలుష్యం, నిర్మాణ పనులు, పొరుగు రాష్ట్రాల్లో రైతులు సాగు వ్యర్థాలకు నిప్పు పెట్టడం వంటి కారణాలతో దిల్లీ నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. ఆస్తమా వంటి శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇలాంటి కారణాలతో ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఇందుకోసం ఆరోగ్య బీమా వినియోగించుకుంటున్న వారి సంఖ్య 2023 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025లో 8 శాతం మేర పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా బీమా సంస్థలు ప్రీమియం వసూలులో గాలి నాణ్యత ఫ్యాక్టర్‌ను జోడించాలని ఆలోచన చేస్తున్నాయి. దీన్ని ఐఆర్‌డీఏఐ ఆమోదిస్తుందా? లేదా? చూడాలి.

# చాట్‌జీపీటీ తగ్గేదేలే..

## 400 మిలియన్లకు యాక్టివ్ యూజర్లు




ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ వినియోగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ విభాగంలో పోటీ ఇచ్చేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొస్తున్నా చాట్‌జీపీటీకి ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. గతేడాది డిసెంబర్‌తో పోలిస్తే ప్రస్తుతం ఉన్న యూజర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బ్రాడ్ లైట్‌క్యాప్ వెల్లడించారు. తమ సేవలు చాలామందికి చేరువైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ చాట్‌బాట్‌కు వారానికి 400 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. డిసెంబర్‌లో ఈ సంఖ్య 300 మిలియన్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో చాలా పెరుగుదల నమోదైంది. చాట్‌జీపీటీని కేవలం వ్యక్తులు మాత్రమే కాదు.. కంపెనీలు కూడా వినియోగిస్తున్నాయి. వీటి సంఖ్య దాదాపు 2 మిలియన్ల వరకు ఉంది. సెప్టెంబర్‌తో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపైంది. ఉబర్, మోర్గాన్ స్టాన్లీ, టీ- మొబైల్స్ వంటి పెద్దపెద్ద కంపెనీలు ఓపెన్ ఏఐని వినియోగిస్తున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. చాలామంది డెవలపర్లు ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ మోడళ్లను వారి సొంత యాప్‌లలో వినియోగిస్తున్నారు. దీంతో ఈ సేవల్ని వినియోగించే డెవలపర్ల సంఖ్య ఆరు నెలల్లో రెట్టింపైంది. అదే సమయంలో ఓపెన్‌ఏఐ అడ్వాన్స్‌డ్ రీజనింగ్ మోడల్ వినియోగం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని కంపెనీ తెలిపింది. ఇదిలాఉండగా.. కృత్రిమ మేధ విభాగంలో ఇప్పటికే పోటీ నెలకొంది. చైనాకు చెందిన ఏఐ కంపెనీ డీప్‌సీక్‌ను ఒక్కసారిగా మార్కెట్‌లోకి దూసుకొచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఎలాన్‌మస్క్‌కు చెందిన గ్రోక్ కూడా తన ఏఐ సేవల్ని మెరుగుపరుస్తూ వస్తోంది. అయినప్పటికీ చాట్‌జీపీటీకి మాత్రం తన యూజర్ల సంఖ్యను ఏమాత్రం కోల్పోకుండా పెంచుకుంటుండటం విశేషం.



# గృహరుణం వడ్డీ రేటు తగ్గలేదా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేటు రెపోను 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. ఈ నేపథ్యంలో రెపో ఆధారిత రుణ వడ్డీ రేట్లు (ఆర్ఎల్ఎల్ఆర్)ను తగ్గించేందుకు ఇప్పటికే పలు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో వడ్డీ రేటు పావు శాతం తగ్గి, చాలామంది గృహరుణ గ్రహీతలకు ప్రయోజనం చేకూరుతోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది.. చాలామంది అనుకున్నట్లు గృహరుణంపై వడ్డీ రేట్లు తగ్గితే బ్యాంకులు వెంటనే నెలవారీ వాయిదాలు (ఈఎంఐ) తగ్గించవు. ఇక్కడ తగ్గేది వ్యవధి మాత్రమే. ఇక మీ వడ్డీ రేటూ తగ్గలేదు అనుకుంటే దానికి కొన్ని కారణాలు ఉంటాయి.

### ఫిక్స్‌డ్ రేటులో..

మీరు తీసుకున్న గృహరుణానికి చలన వడ్డీ (ఫ్లోటింగ్) లేదా స్థిర వడ్డీ (ఫిక్స్‌డ్)లో ఏది వర్తిస్తుందో ముందుగా తెలుసుకోండి. ఒకవేళ స్థిర వడ్డీ వర్తిస్తే మీ వడ్డీ రేటు తగ్గదు. సాధారణంగా మూడేళ్లు స్థిరం ఆ తర్వాత చలన వడ్డీ రేటుకు మారేలా రుణ ఒప్పందం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రుణ వ్యవధి మొత్తం స్థిర వడ్డీనే ఉండొచ్చు. కాబట్టి, ముందుగా బ్యాంకును సంప్రదించి, మీ రుణానికి ఏ వడ్డీ వర్తిస్తోందో తెలుసుకోండి. స్థిర వడ్డీతో ఉంటే.. దాన్ని చలన వడ్డీకి మార్చుకునే ప్రయత్నం చేయొచ్చు. ఇందుకోసం బ్యాంకులు కొంత రుసుమును వసూలు చేస్తాయి.

### చలన వడ్డీలో..

కొన్నిసార్లు చలన వడ్డీ రేటు విధానంలో ఉన్నా.. ఈ తగ్గింపును బ్యాంకులు వర్తింపచేయవు. ఇందుకూ ఒక కారణం ఉంది. చలన వడ్డీ రేటు విధానంలో నిధుల ఆధారిత రుణ వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారంగా మీ రుణం ఉందనుకోండి.. అప్పుడూ వడ్డీ తగ్గకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనూ బ్యాంకును సంప్రదించాలి. రెపో ఆధారిత రుణ వడ్డీ రేటుకు మారేందుకు ప్రయత్నించాలి. ఇందుకోసం బ్యాంకులు కొంత రుసుమును వసూలు చేస్తుంటాయి. ఈ రుసుము రుణ మొత్తాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మీ బ్యాంకు శాఖను సంప్రదించి లేదా ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లోనూ ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రెపో రేటు ఆధారిత వడ్డీ రేటుకు మారడమే మంచిది. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకే ఈ తగ్గింపు వెంటనే అమల్లోకి వస్తుంది. గృహరుణ సంస్థల నుంచి రుణం తీసుకున్నప్పుడు, ఆయా సంస్థలు వడ్డీ రేటును సవరించినప్పుడే, మీ రుణంపై వడ్డీ తగ్గుతుంది. ఈ తగ్గింపును పొందేందుకు కొంత రుసుము చెల్లించక తప్పదు.

# ఆ లోటును పూరిస్తూ.. వచ్చేశాడు

## భారత జట్టులో కీలక పేసర్ మహ్మద్ షమి



2023 వన్డే ప్రపంచకప్‌లో అదిరే ప్రదర్శనతో జట్టు ఫైనల్ చేరడంలో ప్రధాన పాత్ర పోషించాడు మహ్మద్ షమి. కానీ.. గాయం అతడిని చాలా నెలలు టీమ్‌ఇండియాకు దూరం చేసింది. ఇటీవలే ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో పునరాగమనం చేశాడు. అయితే అతడికి అసలైన గ్రాండ్ ఎంట్రీ ఛాంపియన్స్ ట్రోఫీతోనే లభించింది. బంగ్లాదేశ్‌తో తొలి పోరులో అదిరే బౌలింగ్‌తో అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడీ పేసర్. ఐసీసీ టోర్నీలు తనకు మరోసారి కలిసొస్తాయని నిరూపించు కున్నాడు. ముఖ్యంగా వన్డేల్లో తన సత్తాను మరోసారి నిరూపించుకున్నాడు.

### అదే పేస్.. అదే పదును

ఐసీసీ టోర్నమెంట్ అంటే చాలా ఒత్తిడి ఉంటుంది. కానీ షమి మాత్రం ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా చాలా తేలిగ్గా వికెట్లు పడగొడతాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో అతడు బంతిని బ్యాక్ ఆఫ్ లెంగ్త్, షార్ట్ లెంగ్త్ వేస్తూ బ్యాటర్లను బుట్టలో వేస్తున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో షమి ఇదే సూత్రాన్ని ఉపయోగించాడు. వికెట్ టు వికెట్ బౌలింగ్‌తో బంగ్లా బ్యాటర్లను కట్టడి చేశాడు. షాట్ కొట్టేలా ప్రేరేపించి బ్యాటర్లు తప్పు చేసేలా చేశాడు. గాయం తర్వాత లైన్ అండ్ లెంగ్త్‌ను కాస్త సర్దుకోవడం కూడా అతడికి కలిసొచ్చింది. మరోసారి ఐసీసీ టోర్నీల్లో అయిదు వికెట్ల ఘనత సాధించాడు. ఐసీసీ వన్డే టోర్నీల్లో 60 వికెట్లు తీసిన అతడు జహీర్‌ఖాన్‌ను దాటి అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో వన్డే ఫార్మాట్లో 200 వికెట్లు సాధించి మరో మైలురాయి అందుకున్నాడు. విజ్డన్ ప్రకారం 50 ఓవర్ల ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలో ఉత్తమ సగటు, ఉత్తమ వికెట్ టేకింగ్ స్ట్రైక్‌రేట్ కూడా షమి పేరిటే నమోదైంది. ఐసీసీ వన్డే ఈవెంట్లలో షమి పేరిట అయిదు అయిదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయంటే అతడి స్థిరత్వాన్ని ఊహించొచ్చు. మెక్‌గ్రాత్, షేన్‌వార్న్, ముత్తయ్య మురళీధరన్ లాంటి దిగ్గజాల కంటే ఉత్తమైన స్ట్రైక్‌రేట్ షమిదే కావడం విశేషం.

### బుమ్రాకు బదులు..

జస్ప్రీత్ బుమ్రా గత కొంతకాలంగా భారత బౌలింగ్‌కు చుక్కానిగా ఉన్నాడు. ఎన్నో మ్యాచ్‌ల్లో ఒంటి చేత్తో టీమ్‌ఇండియాను గెలిపించాడు. కానీ బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో అయిన గాయం అతడిని మైదానానికి దూరం చేసింది. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో సిరీస్ ఆడలేకపోవడంతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి కూడా తప్పుకొన్నాడు. దీంతో పునరాగమనం చేసిన షమిపై పెద్ద భారం పడింది. ఒకవైపు సత్తా చాటాలి.. ఇంకోవైపు యువ బౌలర్లతో కూడిన పేస్ దళాన్ని నడిపించాలనే బాధ్యతతో ఈ బెంగాల్ బౌలర్ బరిలో దిగాడు. తొలి మ్యాచ్‌లోనే అతడు తన బాధ్యతను గొప్పగా నిర్వర్తించాడు. ఒకవైపు అదిరే బౌలింగ్‌తో ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను కకావికలం చేయడమే కాక.. యువ పేసర్ హర్షిత్ రాణాకు స్ఫూర్తినిచ్చి అతడూ చెలరేగేలా చేశాడు. దీంతో బుమ్రా లేని లోటు అభిమానులకు తెలియలేదు. అయితే షమి పని ఇక్కడితో అయిపోలేదు. ముందుంది అసలు సవాల్! ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై అతడు ఇదే జోరును ప్రదర్శించాల్సి ఉంది. టోర్నీ ఆసాంతం బౌలింగ్ దళాన్ని ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. మరి ఈ పరీక్షలో అతడు ఎంతవరకు సఫలం అవుతాడో చూడాలి.

# అందుకే.. స్పిన్ ఆడటంలో కోహ్లీ ఇబ్బంది : హర్భజన్



విరాట్ కోహ్లీ మరోసారి స్పిన్నర్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదిల్ రషీద్ బౌలింగ్‌లో ఇబ్బంది పడిన కోహ్లీ.. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లా బౌలర్ రిషద్‌కు దొరికిపోయాడు. ఆదివారం పాకిస్థాన్‌తో టీమ్‌ఇండియా కీలక పోరులో తలపడనుంది. అందులోనూ అబ్రార్‌తో కోహ్లీకి ముప్పు తప్పదని క్రికెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో విరాట్ ఎందుకు ఇబ్బందిపడుతున్నాడో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ విశ్లేషించాడు. "స్లో బంతులు, లెగ్గీలు ఆడటం విరాట్ కాస్త అసౌకర్యంగా భావిస్తున్నాడు. లెగ్‌సైడ్ వచ్చే బంతులను ఆడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ వెళ్తే ఒత్తిడి తగ్గుతుంది. ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పుడు ఎక్కువగా సింగిల్స్‌పైనే దృష్టిపెట్టాలి. క్రీజ్‌లో కుదురుకునేందుకు సమయం తీసుకోవాలి. కానీ, విరాట్ విషయంలో ఇప్పటి వరకు అలా జరగలేదు. మనం ఎంత గొప్ప ప్లేయరైనా సరే.. మ్యాచ్‌కు వచ్చేసరికి ప్రదర్శనే కీలకం. వారసత్వం కలిసి రాదు. ఆడాలనే సంకల్పంతో ఉంటే ముందుకు సాగిపోవచ్చు. పరుగులు రాబట్టాలని గట్టిగా అనుకోవాలి. అలాగని సింగిల్స్ కూడా తీయకుండా క్రీజ్‌లో ఉండటం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు భారీ షాట్లకు వెళ్లాలనిపిస్తుంది. ఇక్కడ కోహ్లీ.. ఎవరికీ తానేంటో చూపించాల్సిన అవసరం లేదు. తన సత్తా ఏంటో అతడు నమ్మితే చాలు. ఆటను ఆస్వాదిస్తూ వెళ్తే పరుగులు వాటంతటవే వస్తాయి" అని హర్భజన్ వెల్లడించాడు.

### ఆ లోపాన్ని సరి చేసుకుంటే చాలు : రాబిన్ ఉతప్ప

"విరాట్ కోహ్లీ గొప్ప బ్యాటర్. ఈ విషయాన్ని అతడు కూడా దృష్టిలో పెట్టుకోవాలి. నా అభిప్రాయం ప్రకారం అతడు కాస్త డైలమాలో ఉన్నాడు. ఎప్పుడైతే బంతిని బాగా మిడిల్ చేస్తాడో పరుగుల కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. బ్యాటింగ్ చేసే క్రమంలో స్వేచ్ఛగా ముందుకు సాగితే పరుగులు అవే వస్తాయి. కోహ్లీ సెకండ్ అండ్ థర్డ్ స్లిప్స్ మధ్య ఎక్కువగా పరుగులు రాబడతాడు. కానీ.. ఈ ఇన్నింగ్స్‌లో ఎక్కువగా కీపర్, ఫస్ట్ స్లిప్ మధ్య రన్స్ వచ్చాయి. ప్రతిసారీ ఆఫ్‌సైడ్ కవర్ డ్రైవ్ ఆడాలని ప్రయత్నించాడు. తనకు ఎంతో ఇష్టమైన షాట్ అయినప్పటికీ ఇది చాలా ప్రమాదకరం. ఈ విషయమై అతడితో ఎవరైనా చర్చిస్తారని అనుకుంటున్నా. ఈ లోపాన్ని సరిచేసుకోగలిగితే కోహ్లీ తిరిగి లయను అందుకుంటాడు" అని రాబిన్ ఉతప్ప తెలిపాడు.

# ఆ జట్టేమైనా పాకిస్థానా? ఆసీసా?..

## 35 ఓవర్లలోనే ముగిస్తారనుకున్నా: సెహ్వాగ్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించింది. 229 పరుగుల లక్ష్య ఛేదనను 46.3 ఓవర్లలో పూర్తి చేసి గెలిచింది. ఒకదశలో 144/4 స్కోరుతో భారత్ ఇబ్బందుల్లో పడేలా కనిపించింది. కానీ, శతక వీరుడు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ కలిసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ సమయంలో ఏమైనా కంగారు పడ్డారా? అనే ప్రశ్నకు భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. టీమ్‌ఇండియా ఇంకాస్త ముందుగానే టార్గెట్‌ను ఛేదిస్తుందని భావించానని.. బంగ్లాపై ఏమాత్రం కంగారు పడలేదని వ్యాఖ్యానించాడు. అలా జరగడానికి అదేమైనా పాకిస్థాన్ జట్టా లేదా ఆస్ట్రేలియానా అని పేర్కొన్నాడు. "భారత్ – బంగ్లాదేశ్ మ్యాచ్‌లో నేను ఏదశలోనూ టెన్షన్ పడలేదు. ఎందుకంటే అక్కడ ఉంది బంగ్లా. మీరు ఆ జట్టును నాతో పొగిడించు కోవాలనుకుంటున్నారా? అలా జరగాలంటే అది అద్భుతమైన టీమ్‌గా మారాలి. నేను క్రికెట్ ఆడినప్పుడే బంగ్లాను చూసి ఎప్పుడూ భయపడలేదు. అలాంటిది ఇప్పుడు అసలు కంగారే లేదు. అసాధారణ ప్రదర్శన చేయడానికి అదేమైనా పాకిస్థానా..? ఆస్ట్రేలియానా? మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లను కోల్పోయినా సరే ఇబ్బందే పడలేదు. అయితే, చాలా తేలికగా విజయం సాధించాల్సిన మ్యాచ్. నాలుగు ఓవర్లు మాత్రమే మిగిలి ఉండగా.. భారత్ గెలిచింది. రోహిత్, విరాట్, శ్రేయస్‌లో ఒకరు క్రీజ్‌లో ఉండుంటే భారత్ 35 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేది" అని సెహ్వాగ్ తెలిపాడు.

### కోహ్లీ ఛేజ్ మాస్టర్...

"ప్రతి ఒక్కరి ఫేవరెట్, నాకు రోల్ మోడల్ సచిన్ తెందూల్కర్. అతడితో కలిసి మైదానంలో నడుస్తుంటే ఆ భావనే అద్భుతంగా ఉంటుంది. అడవిలోకి సింహంతో వెళ్తున్నట్లే ఉంటుంది. ప్రతి ఒక్కరి చూపు అతడిపైనే. అప్పుడు నేను నిశ్శబ్దంగా పరుగులు చేసేవాడిని. అయితే, ఛేజింగ్‌లో మాత్రం సచిన్, విరాట్‌లో ఎవరు అంటే మాత్రం నేను విరాట్‌వైపే మొగ్గు చూపిస్తా. 2011-12 నుంచి ఇప్పటి వరకు కోహ్లీ చాలా మారిపోయాడు. అతడి ఫిట్‌నెస్, నిలకడ అద్భుతం. భారత్ కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు" అని సెహ్వాగ్ తెలిపాడు.



# అసలు మా జట్టుకు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే అర్హతే లేదు : కమ్రాన్ అక్మల్

## జింబాబ్వే-ఐర్లాండ్‌తో సిరీసులు ఆడుకోండి

## అక్కడ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీలోకి రావాలి

స్వదేశంలో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్ ఘోర పరాభవంతో ప్రారంభించింది. న్యూజిలాండ్ తో జరిగిన మొదటి మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. దీంతో ఆ జట్టుపై మాజీ క్రికెటర్ల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. పాక్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ మరో అడుగు ముందుకేసి.. జింబాబ్వే-ఐర్లాండ్‌తో సిరీసుల్లో ఆడుకోవాలని వ్యాఖ్యానించాడు. అక్కడ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీలోకి రావాలని కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్‌కు అక్మల్ చురకలంటించాడు. "ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ జట్టు వైదొలగాలి. జింబాబ్వే, ఐర్లాండ్‌ల మధ్య జరుగుతోన్న సిరీస్‌లో పాల్గొనాలి. అందులో విజయం సాధిస్తేనే మా టీంకు ఛాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే అర్హత ఉన్నట్లు. ఇలా అనడానికి కారణం ఉంది. మా జట్టు ఆటతీరు ఇలానే ఉంది. గత ఆరేడేళ్ల నుంచి మా జట్టు క్రికెట్ ప్రమాణాలు అతి ఘోరంగా పడిపోయాయి' అని వ్యాఖ్యానించాడు.

### కివీస్‌ను చూసి నేర్చుకోండి

"పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కివీస్ నిలకడైన ఆటతీరును ప్రదర్శించింది. మూడు వికెట్లు కోల్పోయినా స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ ఆ జట్టు బ్యాటర్లు పరుగులు రాబట్టారు. తొలుత నెమ్మదిగా ఆడి.. మ్యాచ్ తమ నియంత్రణలోకి వచ్చిందని భావించాక దూకుడు పెంచారు. పరిణితి చెందిన జట్టు చేసే పని అదే. కనీసం కివీస్‌ను చూసైనా పాక్ నేర్చుకోవాలి. విల్ యంగ్, టామ్ లేథమ్ నిలకడగా ఆడి సెంచరీ సాధించారు" అని కమ్రాన్ అక్మల్ తెలిపాడు. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ పాకిస్థాన్ ముందు 320 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత ఛేజింగ్‌లో పాక్ విఫలమైంది. కివీస్ బౌలర్ల దెబ్బకు పాక్ జట్టు కేవలం 260 పరుగులకే పరిమితమైంది.



# సీనియర్ల విషయంలో గంభీర్ కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు

## అనిల్ కుంబ్లే

భారత జట్టు భవిష్యత్తు కోసం మార్పులు చేసే క్రమంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే సూచించాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత ప్రధాన కోచ్ గంభీర్ ఎదుట కఠిన సవాళ్లు ఎదురవుతాయని వ్యాఖ్యానించాడు. సీనియర్లు రోహిత్, విరాట్, రవీంద్ర జడేజా, షమీ విషయంలో కఠిన నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని.. అంతా సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత మాత్రం గంభీర్‌పైనే ఉందన్నాడు. "భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఇది చాలా కీలకమైన టోర్నీ. ఎందుకంటే దీని తర్వాత చాలా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. స్టార్ ప్లేయర్ల వారసత్వాన్ని కొనసాగించాలి. అయితే, ఇది కోచ్‌గా ఆయన బాధ్యత. అందుకే, ఈ టోర్నమెంట్‌తో సీనియర్ల భవిష్యత్తు కూడా తేలిపోనుంది. ఏ స్థానాల్లో మార్పులు చేయాలనేది తెలుస్తుంది. గెలిచినా.. ఓడినా మార్పులు మాత్రం ఖాయం. ఇది ముగిసిన తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 మెగా టోర్నీకి సన్నాహాలు ప్రారంభించాలి. అలా చేయాలంటే యువకులతో కూడిన స్క్వాడ్‌ను సిద్ధం చేసుకోవాలి. అందులోని ప్రతిఒక్కరికీ కనీసం 20 మ్యాచుల్లో ఆడే అవకాశం కల్పించాలి. అప్పుడే పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడేందుకు ఆస్కారముంటుంది.

ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత సీనియర్లను కొనసాగించాలా? యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వాలా అనేది కోచ్, మేనేజ్‌మెంట్ నిర్ణయించాలి. ఈ విషయంలో గంభీర్ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. టీ20ల్లో ఇప్పటికైతే సన్నద్ధత బాగుంది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో జట్టు మెరుగైన ప్రదర్శన చేస్తోంది. వచ్చే ఏడాది పొట్టి కప్ జరగనుంది. వన్డే ప్రపంచకప్‌నకు రెండేళ్ల సమయం ఉంది. ఆలోగా యువ క్రికెటర్లను సిద్ధం చేయొచ్చు. నిలకడగా పరుగులు చేసే క్రికెటర్లకు అవకాశాలు ఇవ్వాలి" అని కుంబ్లే వెల్లడించాడు. రోహిత్, విరాట్ ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే ఫార్మాట్‌కూ గుడ్‌బై చెబుతారని క్రికెట్ వర్గాల అంచనా.

# సౌతాఫ్రికా చేతిలో ఆఫ్ఘనిస్తాన్ చిత్తు




ఛాంపియన్స్ ట్రోఫీలో సౌతాఫ్రికా తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్ బి లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్ లో ఆఫ్ఘనిస్తాన్ పై సఫారీలు 107 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(103: 106 బంతుల్లో.. 7 ఫోర్లు, సిక్సర్) సెంచరీతో పాటు కెప్టెన్ బవుమా(58), రాస్సీ వాన్ డెర్ డస్సెన్(52),ఐడెన్ మార్క్రామ్(52) హాఫ్ సెంచరీలతో రాణించారు. లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ 43.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయింది. రహ్మత్ షా(90) చివరి వరకు పోరాడినా అతనికి సహకరించేవారు కరువయ్యారు. 316 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్తాన్ ఏ దశలోనూ లక్ష్యాన్ని అందుకునేలా కనిపించలేదు. ఆ జట్టు వరుస విరామాల్లో వికెట్లను కోల్పోతూ వస్తుంది. దీంతో 50 పరుగులకే నాలుగు వికెట్లను కోల్పోయి మ్యాచ్ పై ఆశలు వదిలేసుకుంది. ఈ దశలో రహ్మత్ షా ఒక్కడే వారియర్ లా పోరాడాడు. సహచర ప్లేయర్లు విఫలమైనా సెంచరీతో జట్టు పరువును కాపాడాడు. 90 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచి సెంచరీ మిస్ చేసుకున్నాడు. మిగిలిన వారిలో ఏ ఒక్కరు కూడా కనీసం 20 పరుగులు చేయలేకపోయారు. సౌతాఫ్రికా బౌలర్లలో రబడా మూడు వికెట్లు పడగొట్టాడు. ఎంగిడి, మల్డర్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(103: 106 బంతుల్లో.. 7 ఫోర్లు, సిక్సర్) సెంచరీతో పాటు కెప్టెన్ బవుమా (58), రాస్సీ వాన్ డెర్ డస్సెన్(52),ఐడెన్ మార్క్రామ్(52) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆరంభంలోనే ఆ జట్టు వికెట్ కోల్పోయింది. టోనీ డి జోర్జి 11 పరుగులు చేసి నబీ బౌలింగ్ లో ఔటయ్యాడు. ఈ దశలో కెప్టెన్ ఓపెనర్ రికెల్టన్, బవుమా ఇన్నింగ్స్ ను ముందు తీసుకెళ్లారు. ఆఫ్ఘన్ బౌలర్లను ఈజీగా ఆడిస్తూ భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రెండో వికెట్ కు ఏకంగా 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారీ స్కోర్ కు బాటలు వేశారు. ఈ క్రమంలో వీరిద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. హాఫ్ సెంచరీ తర్వాత బవుమా(58) ఔటైనా.. వాన్ డెర్ డస్సెన్ సహకారంతో రికెల్టన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మిల్లర్ విఫలమైనా డస్సెన్, మార్క్రం హాఫ్ సెంచరీలతో సౌతాఫ్రికా స్కోర్ బోర్డును 300 పరుగులు దాటించారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో మహమ్మద్ నబీ రెండు వికెట్లు పడగొట్టాడు. ఫరూఖీ, ఓమర్జాయ్, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

# ఆ ఇద్దరినీ కాదని.. బెస్ట్ ఫీల్డర్‌గా కేఎల్ రాహుల్



ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్‌ఇండియా విజయంతో మొదలుపెట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో బంగ్లాపై ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. గత వన్డే ప్రపంచకప్ సమయంలో బెస్ట్ ఫీల్డర్ మెడల్‌ను అందజేస్తూ ఓ ఆనవాయితీని బీసీసీఐ మేనేజ్‌మెంట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ నాణ్యమైన ఫీల్డింగ్ నైపుణ్యం ప్రదర్శించిన క్రికెటర్‌కు కోచ్ దిలీప్ మెడల్‌ను ప్రకటించారు. ఈసారి రేసులో ముగ్గురు నిలవగా.. అందులో ఒకరికి ఈ మెడల్ దక్కింది. ఆ వివరాలతో కూడిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. "వెల్‌డన్ బాయ్స్.. తొలి మ్యాచ్‌లో అద్భుతమైన ఫీల్డింగ్ చేశారు. డోమ్ లైట్ల వెలుతురులో క్యాచ్‌లను అందుకోవడం చాలా కష్టమే. అయితే, ప్రతి మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకుంటున్నాం. తర్వాత మ్యాచ్‌లో మరింత బలంగా మైదానంలోకి దిగుదాం. ఇక ఈ మ్యాచ్‌లో అందరూ చురుగ్గానే కదిలారు. అయితే, అతడి వద్దకు ఎప్పుడు బంతి వచ్చినా ఒడిసిపట్టుకొనే క్రికెటర్ విరాట్ కోహ్లీ. అలాగే వికెట్ల వెనక కీపింగ్ చేయడం ఎప్పుడూ సవాలే. కొత్త బంతిని అంచనా వేయడం చాలా కష్టం. లెగ్‌సైడ్ డైవింగ్ చేస్తూ అద్భుత ఫీల్డింగ్ చేసిన కేఎల్ రాహుల్‌కు నా అభినందనలు. శుభ్‌మన్ గిల్ కూడా బెస్ట్ ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ ముగ్గురిలో ఈసారి కేఎల్ రాహుల్‌కు బెస్ట్ ఫీల్డర్ మెడల్ ఇస్తున్నాం" అని దిలీప్ వెల్లడించాడు.

# 'బాపు'.. మూవీ ఎలా ఉంది?

రివ్యూ




'బలగం' ఛాయలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన చిత్రం 'బాపు'. బ్రహ్మాజీ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో 'బలగం' సుధాకర్‌రెడ్డి టైటిల్ పాత్రలో నటించారు. మరి ఈ బాపు కథేంటి?అతని ప్రయాణం ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతులు అందించింది?

**కథేంటంటే:** తెలంగాణలోని ఓ మారుమూల గ్రామంలో జరిగే కథ ఇది. మల్లన్న (బ్రహ్మాజీ) ఓ బీదరైతు. అప్పు చేసి, తనకున్న ఎకరం భూమిలో పత్తి పండిస్తాడు. అయితే, మల్లన్న కొడుకు రాజు (మణి ఎగుర్ల) నిర్లక్ష్యం వల్ల ఆ పంటంతా వర్షార్పణం అయిపోతుంది. దీంతో అప్పిచ్చిన వాళ్లంతా ఒక్కసారిగా మల్లన్న ఇంటిపై పబీడతారు. నెలరోజుల్లోగా అప్పు తిరిగి చెల్లించకపోతే పొలాన్ని వేలం వేయిస్తామని హెచ్చరిస్తారు. దీంతో చేసేదేమీ లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు మల్లన్న. అలా చేస్తే ప్రభుత్వం నుంచి రూ.5లక్షల రైతు బీమాతో కొంతైనా అప్పు తీరుతుందనుకుంటాడు. అతని నిర్ణయానికి భార్య సరోజ (ఆమని) అడ్డు చెబుతుంది. కావాలంటే ఆ రైతు బీమా డబ్బు కోసం ఇంటి పెద్ద, మల్లన్న తండ్రైన రాజయ్య (బలగం సుధాకర్‌రెడ్డి)ను చంపేద్దామని సలహా ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏం జరిగింది? మల్లన్న తన భార్య, పిల్లలతో కలిసి తండ్రిని చంపడానికి ఎలాంటి ప్రణాళికలు రచించారు? అవన్నీ ఫలించాయా లేదా?అన్నది కథ.

**ఎవరెలా చేశారంటే:** రైతన్నల ఆత్మహత్యల అంశంతో ముడిపడి ఉన్న కథ ఇది. కొన్ని వాస్తవ సంఘటనల స్ఫూర్తితో దర్శకుడు దీన్ని సిద్ధం చేసుకున్నారు. అలాగని ఇదేమీ పూర్తిగా సీరియస్‌గా సాగే కథైతే కాదు. డార్క్ హ్యూమర్‌తో భావోద్వేగభరితంగా చెప్పే ప్రయత్నం చేశారు. రైతుల కష్టాన్ని ఓవైపు చూపిస్తూనే.. మరోవైపు డబ్బు అవసరం మనిషితో ఎలాంటి తప్పులు చేయిస్తుంది? బంధాల్ని ఎలా బలి పెట్టేలా చేస్తుందన్నది? కళ్లకు కట్టింది. ఈ చిత్రం ప్రధానంగా మల్లన్న తండ్రి చుట్టూనే తిరుగుతుంది. అతని కుటుంబంలోని ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ నిదానంగా కథను ముందుకు తీసుకెళ్లాడు దర్శకుడు. అప్పు తీర్చడానికి మామ రాజయ్యను చంపుదామని మల్లన్న భార్య సలహా ఇవ్వడం కథను మలుపు తిప్పుతుంది. మల్లన్న తన సమస్యను తండ్రికి చెప్పి.. ఆత్మహత్య చేసుకోమని ఒప్పించడం.. ఈ క్రమంలో అతన్ని బలిచ్చే మేకలా పోషించడం ప్రేక్షకులు ఓ పట్టాన జీర్ణించుకోలేకపోవచ్చు. భార్య చెప్పిన మాట విని అంత తేలికగా తండ్రిని చంపుకొనేందుకు మల్లన్న ఎందుకు సిద్ధపడ్డాడో ఏమాత్రం అర్థం కాదు. మరోవైపు ఆత్మహత్య చేసుకుంటానని చెప్పిన రాజయ్య ఆ సంగతి మర్చిపోవడం.. ఈ విషయం తెలియక అతని చావు కోసం ఎదురు చూస్తూ మల్లన్న, అతని భార్య పడే తిప్పలు అక్కడక్కడా నవ్వులు పూయిస్తాయి. సరిగ్గా విరామానికి మల్లన్న కుటుంబమంతా కలిసి ఆ ముసలాయన్ని చంపేందుకు సిద్ధమవ్వడంతో తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంటుంది.

ఇక అక్కడి నుంచి రాజయ్యను చంపేందుకు మల్లన్న కుటుంబం ఎలాంటి ప్రణాళికలు వేసింది.. వాటి నుంచి ఆ ముసలాయన ఎలా తప్పించుకున్నాడనే కోణంలోనే ద్వితీయార్ధమంతా సాగుతుంది. ఆ ఎపిసోడ్స్ ప్రేక్షకుల్ని బాగానే నవ్విస్తాయి. ఇక ఈ మధ్యలో మల్లన్న పిల్లల ప్రేమకథలు కథాగమనానికి స్పీడ్ బ్రేకర్లలా అడ్డుతగులుతుంటాయి. కథ ఆరంభం నుంచి సాగుతున్న బంగారు విగ్రహం ఎపిసోడ్ ఆఖరికి ఏమవుతుందన్నది ప్రేక్షకులు ముందే ఊహించేయొచ్చు. క్లైమాక్స్‌ను దర్శకుడు చాలా సింపుల్‌గా తీర్చిదిద్దుకున్నాడు. కానీ, ఆ ముగింపు అందర్నీ సంతృప్తి పరచకపోవచ్చు.

**ఎవరెలా చేశారంటే:** బ్రహ్మాజీ పేద రైతుగా ఒదిగిపోయాడు. భావోద్వేగ సన్నివేశాల్లో ఆయన నటన ఆకట్టుకుంటుంది. సరోజగా ఆమని పాత్ర అందర్నీ అలరిస్తుంది. రాజయ్య పాత్రలో బలగం సుధాకర్‌రెడ్డి అమాయకత్వం, సహజమైన నటన ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది. మణి, ధన్య, శ్రీనివాస్ అవసరాల, రచ్చ రవి, గంగవ్వ తదితరుల పాత్రలు కథకు తగ్గట్లు పరిధి మేరకు ఉంటాయి. దర్శకుడు దయ ఈ కథలోని పాత్రల్ని చాలా సహజంగా తెరపై చూపించాడు. ఎంచుకున్న కథలో కొత్తదనముంది. రైతుల కష్టాల్ని.. వాళ్ల ఆత్మహత్యలకు గల కారణాల్ని వాస్తవంగా దగ్గరగా చూపించే ప్రయత్నం చేశారు. తెలంగాణ వాతావరణాన్ని ఎంతో సహజంగా చూపించారు. ధ్రువన్ సంగీతం, పాటలు కథలో భాగమయ్యాయి. నిర్మాణ విలువలు కథకు తగ్గట్లుగా కుదిరాయి.



## హరిహర వీరమల్లు నుంచి కొల్లగొట్టినాదిరో.. పాట

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' నుండి సెకండ్ సింగిల్ 'కొల్లగొట్టినాదిరో' ఫిబ్రవరి 24న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ తో పాటు కథానాయిక నిధి అగర్వాల్ పై ఈ పాటను నైట్ ఎఫెక్ట్స్ లో చిత్రీకరించారు. విశేషం ఏమంటే... ఇందులో అనసూయ భరద్వాజ్‌తో పాటు పూజిత పొన్నాడ కూడా స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చింది. 'కోర కోర మీసాలతో, కొదమ కొదమ అడుగులతో... కొంటెకొంటె చణుకులతో, కొలిమి లాంటి మగటిమితో... సరసర వచ్చినాడు చిచ్చర పిడుగంటి వాడు' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాశారు. దీనిని ఎం.ఎం. కీరవాణి స్వరపర్చగా, దీనిని మంగ్లీ , రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల గానం చేశారు.ఎ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది విడుదల కాబోతోంది. తొలి భాగాన్ని మార్చి 28న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాకు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. అయితే బాలెన్స్ ఉన్న చిత్రీకరణ ను పూర్తి చేసే బాధ్యతను ఎ.ఎం. రత్నం తనయుడు జ్యోతికృష్ణ భుజానికి కెత్తుకున్నాడు. పవన్ కళ్యాణ్ పాల్గొనగా నాలుగు రోజుల ఎ÷-లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఒక్కటి ఇంకా చిత్రీకరించాల్సి ఉందని, అది మినహా మిగిలిన భాగానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొత్తం జరుగుతోందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలను బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి తదితరులు పోషించారు.



## 'నో కిస్.. నో ఇంటిమేట్ సీన్స్' పాలసీ పెట్టుకోవడానికి కారణమదే : నటుడు

'మార్కో'తో ఇటీవల విజయాన్ని అందుకున్నారు మలయాళ నటుడు ఉన్ని ముకుందన్. పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రాల్లో నటించడమే తనకు ఇష్టమని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తన సినిమాలను అన్ని వయసుల వారు వీక్షించాలనేది ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ కారణంతోనే దర్శక నిర్మాతలు ఎంత ఒత్తిడి తెచ్చినా.. తాను కొన్నింటిని ఎప్పటికీ అంగీకరించనని స్పష్టం చేశారు. "సినిమాల్లోకి అడుగుపెట్టిన సమయంలోనే.. ముద్దు, ఇంటిమేట్ సీన్స్‌కు దూరంగా ఉండాలనే పాలసీ పెట్టుకున్నా. ఇప్పటివరకూ నటించిన అన్ని సినిమాల్లోనూ దానిని పాటించా. ప్రేక్షకులందరూ కలిసి కూర్చొని చూసేలా నా సినిమాలు ఉండాలి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. అలాంటి సీన్లలో నటించాలని ఎంతోమంది దర్శక నిర్మాతలు నాపై ఒత్తిడి తీసుకువచ్చారు. వేరే హీరోల సినిమాలను ఉదాహరణగా చూపిస్తూ మీరూ చేయొచ్చుగా అని అడుగుతుంటారు. ఒక జంట మధ్య రొమాన్స్ చూపించాలనుకుంటే.. ముద్దులు పెట్టుకోవడం ఒక్కటే మార్గం కాదనేది నా భావన. నా తోటి హీరోలు అలాంటి సన్నివేశాల్లో నటించడాన్ని నేను ఏమాత్రం తప్పుపట్టను. నేను అలాంటి వాటిల్లో నటించను. ఇది నాకు నేనుగా పెట్టుకున్నా పాలసీ" అని ఉన్ని ముకుందన్ చెప్పారు. మలయాళంలో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఉన్ని ముకుందన్ 'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడి', 'యశోద' వంటి తెలుగు సినిమాల్లోనూ యాక్ట్ చేశారు. ఆయన నటించిన 'మార్కో' బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఓటీటీలోనూ అందుబాటులో ఉంది. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'గెట్ సెట్ బేబీ' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



## ఆ సీన్‌లో మోహన్‌లాల్ యాక్టింగ్ నచ్చలేదు.. : రామ్‌గోపాల్ వర్మ

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ నటనపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ప్రశంసలు కురిపించారు. ఆయన సహజ నటుడని పేర్కొన్నారు. తమ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కంపెనీ' రోజులను గుర్తు చేసుకున్నారు. కంపెనీ స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ చూసి షాకయ్యానని తెలిపారు. "కంపెనీ' కథ చెప్పడం కోసం తొలిసారి మోహన్‌లాల్‌ను కలిశా. కథ, తన పాత్రను ఉద్దేశించి చాలా సందేహాలు అడుగుతారని.. ఆ మేరకు సన్నద్ధమయ్యా. ఆయన ఏం అడిగినా సమాధానం చెప్పాలనుకున్నా. తీరా కథ చెప్పడం పూర్తి కాగానే ఆయన.. ఎన్ని రోజులు షూట్ చేస్తారని మాత్రమే అడిగారు. ఇలాంటి క్లైమాక్స్ నేను అస్సలు ఊహించలేదు. నాకు తెలిసి దర్శకులందరితో ఆయన ఇదే విధంగా వ్యవహరిస్తుంటారు. ఎందుకంటే ఆయనకు సినిమా గురించి ఎంతో అవగాహన ఉంది. అలాగే, దర్శకులపై ఆయన నమ్మకం ఉంచుతారు" "కంపెనీ' షూట్ సమయంలో యాక్టింగ్ పరంగా కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఓ సీన్‌లో ఆయన ప్రదర్శన నాకు ఏమాత్రం నచ్చలేదు. సీన్‌కు అనుగుణంగా ఆయన నటించడం లేదనిపించింది. అదే సన్నివేశాన్ని సుమారు ఏడెనిమిది టేకులు చేశాం. తర్వాత వాటన్నింటినీ పరిశీలిస్తే ఆయన తొలి టేక్‌లోనే బాగా చేశారనిపించింది. నిజం చెప్పాలంటే ఆయన సహజ నటుడు. సీన్ వివరిస్తే చాలు దర్శకుడికి కావాల్సిన విధంగా నటిస్తారు" అని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. 2002లో 'కంపెనీ' మూవీ విడుదలైంది.



## మణిరత్నం సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నవీన్ పోలిశెట్టి



టాలీవుడ్ యువ కథానాయకుడు నవీన్ పోలిశెట్టి బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. తాజాగా ఆయన దిగ్గజ దర్శకుడు మణిరత్నంతో సినిమా చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నలు, మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నవీన్. సినిమా సినిమాకు గ్యాప్ తీసుకునే నవీన్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో చేయికి గాయం అయ్యింది. దీంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. అయితే నవీన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం అనగనగా ఒకరాజు. మీనాక్షి చౌదరీ ఈ సినిమాలో కథనాయికగా నటిస్తుంది. ఈ సినిమా అనంతరం నవీన్ మణిరత్నం సినిమాలో చేయబోతున్నట్లు తెలుస్తుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి త్వరలోనే అన్ని వివరాలు వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మణిరత్నం విషయానికి వస్తే.. ప్రస్తుతం థగ్ లైఫ్ అనే సినిమను తెరకెక్కిస్తున్నాడు. కమల్ హాసన్, శింబు ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ చిత్రం ఈ సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## చిరంజీవి మాట.. నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది : సందీప్ కిషన్



'మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటుడు సందీప్ కిషన్. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు. "ఎవరి సపోర్ట్ లేకుండా నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా" అని సందీప్ కిషన్ అన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. "ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా" అని చెప్పారు.

## ధనుష్ మేకింగ్ స్టైల్‌పై కీర్తిసురేశ్ ప్రశంసలు

హీరో ధనుష్ మేనల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్'. ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు. "ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండిపోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు" అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.




## ఓటిటిలోకి వస్తోన్న ఎమర్జెన్సీ

కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమ్జర్గ÷న్సీ'. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చి చివరకు జనవరి 17న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. త్వరలో ఇది ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుందని కంగన తాజాగా ప్రకటించారు. నెట్‌ప్లిక్స్ వేదికగా మార్చి 17 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఆధారంగా చేసుకొని దీనిని సిద్ధం చేశారు. ఇందిరాగాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయిగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. రూ.60 కోట్లతో దీనిని రూపొందించగా.. రూ.21 కోట్లు మాత్రమే ఈ సినిమా రాబట్టినట్లు అంచనా.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463